


కొవ్వూరు కమిషనర్‌గా నాగేంద్రకుమార్



కొవ్వూరు, ఆగస్టు 26 : కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా టి.నాగేంద్రకుమార్ నియమితులయ్యారు. పలాస కాశిబుగ్గ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ నాగేంద్రకుమార్ బదిలీపై కొవ్వూరు రానున్నారు. ఇప్పటి వరకు కొవ్వూరు కమిషనర్‌గా ఉన్న కె.డానియేల్ జోసెఫ్ కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లనున్నారు.



జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఆసుపత్రి భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందికి ఎస్పీ ఆదేశం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వచ్చిన ఆయన గురువారం ఆసుపత్రి సెక్యూరిటీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలోని వైద్యులు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బందితో పాటు చికిత్సకు వచ్చే రోగుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమైన, అత్యంత కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ శర్మ,పోలీసులుపాల్గొన్నారు.

వైద్యసేవలపై ఫిర్యాదులు సహించను : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : వైద్యసేవల్లో జవాబుదారీతనం అవసరమని.. ఎన్‌టీఆర్ ఆరోగ్య వైద్యసేవలను ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణ కమిటీ సభ్యులతోను సమీక్ష జరిపారు. వైద్యసేవలందించే క్రమంలో లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇలాంటి ఫిర్యాదులకు సంబంధించి బిల్లుల చెల్లింపు నిలుపుదల చేస్తామన్నారు. పరీక్షలు, వైద్యసేవలు ఉచితంగా అందించాలన్నారు. ఎన్‌టీఆర్ ఆరోగ్యసేవలకు మూడు షిఫ్టుల్లో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. రోగిని డిశ్చార్జి చేసే సమయంలో పది రోజులకు సరిపడా మందులు, రవాణా చార్జీలు ఇవ్వాలన్నారు. నగదు వసూలు, సరైన చికిత్స లేదని, మౌలిక వసతులు కల్పించడంలేదని 11 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్‌టీఆర్ వైద్యసేవ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో వరి చేను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కలుపు నివారిస్తే.. పొడ తెగులు ఆశించదు

ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్

కొవ్వూరు/తాళ్లపూడి, ఆగస్టు 29 : కలుపు నివారణ ద్వారా వరి పంటలో పొడ తెగులు ఆశించకుండా నివారించవచ్చునని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ అన్నారు. కొవ్వూరు మండలం ధర్మవరం,తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామాల్లో వరి పంటను శాస్త్రవేత్త మానుకొండ శ్రీని వాస్, మార్టేరు పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సిహెచ్.శ్రీనివాస్, కొవ్వూరు వ్యవసాయశాఖ ఏడీ పి.చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సార్వాలో వరి పంటను పొడ తెగులు ఆశించకుండా కలుపు నివారణ తప్పనిసరి అన్నారు. పొడతెగులు లక్షణాలు నీటికి దగ్గరగా ఉన్న కాండంపై బూడిద నుంచి తెలుపురంగు మచ్చలు, గోధుమరంగు అంచులతో ఆకులు, కాడలపై కనిపిస్తాయన్నారు. ప్రస్తుతం వరి పంట పొలాలలో పొడ తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని రైతులు పొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ లేదా వాలిడామైసిన్ లేదా ప్రొపికోనజోల్‌లలో ఏదో ఒక మందును అధికారుల సూచనలతో పిచికారీ చేయాలని సూచించారు.

అక్రమంగా 164 ఎకరాలు అమ్మేశారు : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : గోపాలపురం మండలం భీమోలు భూములకు సంబంధించి చోటుచేసుకున్న ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తమకు హామీ ఇచ్చారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. ఈ మేరకు గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నాయకత్వంలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలపై రెవెన్యూ మంత్రికి జిల్లాల వారీగా నివేదికలు అందజేసినట్టు తెలిపారు. భీమోలులో అక్రమంగా సుమారు 164 ఎకరాల భూములను అనపర్తి రెడ్లకు అమ్మేశారని, దీనిపై విచారణ జరిపించాలని మంత్రిని కోరగా ఆయన విచారణ జరిపిస్తామని తమకు స్పష్టం చేశారని మధు పేర్కొన్నారు.

తెలుగు..వెలగాలి!

అమ్మ భాషను మర్చిపోకూడదు : కలెక్టర్



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తెలుగులో న్యాయమూర్తి తీర్పు 7



ఆ..కట్టుకునేలా.. ఇదీ మన సంప్రదాయం

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఆగస్టు 29: మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత.. అమ్మ భాషను మర్చిపోతే అమ్మను మర్చిపోయినట్టే.. ప్రతి తెలుగువాడు తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడాలి.. తెలుగు. వెలగాలి.. అంటూ కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి 162వ జయంతిని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు నివాళుల ర్పించి మాట్లాడారు. వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు అన్నారు. మన మాతృభాషను గౌరవించడం ముఖ్యమన్నారు. నేడు తెలుగు భాషను మర్చిపోయే స్థితికి రావడం దురదృష్టకరమన్నారు. తెలుగు వారు ప్రతి ఒక్కరు ఖచ్చితంగా తెలుగులో మాట్లాడాలి, చదవాలి, రాయాలన్నారు. అనంతరం సాహిత్య పద్యాలు, కవితలు ,పాటలను ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బి.ఏసుబాబు ఆలపించారు. గిడుగు జీవిత విశేషాలను విద్యార్థి కిషోర్, వాడుక భాషపై విధేయత ఇచ్చిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులను, విద్యార్థులను కలెక్టర్ సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు తెలుగుపై తమకు ఉన్న మమకారాన్ని ఇలా చాటుకున్నారు. కార్యక్రమంలో జేసీ చిన్నరాముడు,డీఆర్‌వో జి.నరసింహులు, డీఈవోవాసుదేవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నాప్ హైడ్రామా!
నేడు పోలీసుల ముందుకు నిందితులు
మధ్యవర్తి ద్వారా మంతనాలు 7
బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం తెస్తాం

నేడు, రేపు ప్రత్యేక వైద్యశిబిరాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : ప్రస్తుతం సీజన్లో వస్తున్న జ్వరాల నేపథ్యంలో ప్రజల కోసం ఈ నెల 30, 31 తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలోని సంబంధిత పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు 57 వైద్య శిబిరాలు నిర్వహించి జ్వరం కేసులు 246 గుర్తించారన్నారు.మరో రెండు రోజుల పాటు వైద్యశిబిరాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.



పింఛన్లలో.. నకిలీలు!

ఇష్టానుసారంగా పింఛన్లు పంపిణీ

- అనర్హులకు అందలం
- వినిపించదు..కనిపించదు?
- నకిలీ సర్టిఫికెట్ల బాగోతం
- నాడు వలంటీర్ల చేతివాటం
- నేటికీ గ్రామగ్రామాన అందజేత
- పట్టించుకోని అధికారులు
- అర్హులకు సవాలక్ష నిబంధనాలు
- వేలాదిగా దరఖాస్తులు పెండింగ్

గోపాలపురం, ఆగస్టు 29 : పింఛన్లు ఇష్టానుసారం ఇచ్చేస్తున్నారు.. అర్హులెవరు.. అనర్హులెవరు కనీసం దృష్టి సారించడంలేదు..గత ప్రభుత్వంలో కొంత మంది వలంటీర్లు ఇష్టారాజ్యంగా అర్హత ఉన్నా లేకపోయినా దొంగ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి తమ బంధువులకు పింఛన్లు మంజూరు చేయించుకున్నవారు ఉన్నారు. రాజకీయ పలుకుబడితో కొందరు ఉన్నారు. ఇలా ప్రతి గ్రామంలో ఉన్నట్టు సమాచారం. జిల్లా వ్యాప్తంగా సుమారు 10 శాతం అనర్హులు ఉంటారనేది ఒక లెక్క. అవి ప్రభుత్వం మారినా నేటికీ కొనసాగుతున్నాయి. పింఛన్లు తీసుకుంటున్న వారిలో అక్కడక్కడా నాటి వైసీపీ నాయకులు ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తుండడంతో ఉన్నతాధికారులు ఒక నెల డ్రైవ్ పెడితే అనర్హులు చిక్కే అవకాశం ఉంది.

అర్హులకు సవాలక్ష ఆంక్షలు..

జిల్లాలో అర్హత కలిగిన పింఛనుదారులు వాటిని పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం మారినా నేటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయడంలేదు. దరఖాస్తులు మాత్రం వేలల్లో ఉన్నట్టు సమాచారం. అయితే అర్హులు మాత్రం పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారోనని ఎదురు చూస్తున్నారు. నేటికీ కదలిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హతలు ఉన్న ఆర్థిక స్తోమత లేకపోవడం.. అధికారులకు ఆమ్యామ్యాలు చెల్లించ లేకపోవడం తదితర కారణాలతో అర్హులకు పింఛన్లు మంజూరుకావడం లేదు.కొంత మందికి అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో వెలితి చూపుతూ పింఛను పొందుతున్నారు. గత పాలకుల పాపంతో నకిలీ సర్టిఫికెట్ల ద్వారా ప్రతి నెల వేలాది రూపాయల సామాజిక భద్రత పింఛన్లు ఏళ్ళ తరబడి పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఇటీవల నకిలీ పింఛన్లపై విచారణ జరిపి స్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేశారు.

చేసిందెవరు?

గత ప్రభుత్వంలో వలంటీర్లు చెప్పిందే వేదం.. వారు ఏం చెబితే అది.. క్షేత్రస్థాయి పరిశీలన అంతంతమాత్రమే. దీంతో ఇబ్బడిముబ్బడిగా పింఛనుదారులు పెరిగిపోయారు. చాలా గ్రామాల్లో పదుల సంఖ్యలో అనర్హులు ఉన్నట్టు సమాచారం. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది తీగలాగితే డొంక కదులుతోంది. ప్రతి గ్రామంలోనూ నకిలీ పింఛనుదారులు ఉన్నట్టు సమాచారం.వీరిలో వినికిడి సమస్య ఉన్నట్టు నమోదు చేయించుకుని పింఛనుపొందుతున్న వారు అధికం..అంతే కాకుండా పెరాలసిస్ వ్యాధికి గురై శాశ్వత దివ్యాంగత్వం పొందినట్టు పింఛనుపొందుతున్న వారు ఉన్నారు. మరికొంత మంది మానసిక వికలాంగులగాను పింఛను పొందుతున్నట్టు తెలిసింది. ఇంకొంత మంది వయసు తప్పుగా నమోదు చేయించుకుని వృద్ధాప్య పింఛను పొందుతున్నారు. ఇలా రకరకాలుగా ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఇదిగో నకిలీ..మకిలీ..

గోపాలపురం మండలం కరిచర్లగూడెంకు చెందిన ఒక వ్యక్తి గత వైసీపీ ప్రభుత్వంలో కొంత మందికి నకిలీ సర్టిఫికెట్లు అందజేసినట్టు సమాచారం. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేలు చొప్పున చాలా మంది నుంచి వసూలు చేసినట్టు తెలిసింది. ఆ సర్టిఫికెట్‌ను అడ్డుపెట్టుకుని అప్పటి వలంటీర్లు చేతివాటం ప్రదర్శించి ఆన్‌లైన్ చేయడంతో గత ఐదేళ్లుగా సామాజిక భద్రత పింఛన్ పేరుతో కరిచర్లగూడెం గ్రామంలో సుమారు ఆరుగురు రూ.15 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల పింఛన్లు పొందుతున్నారు. అంతే కాకుండా గోపాలపురం మండలం ఉప్పరగూడెంలో డప్పు వాయించడం రాని కొందరు నకిలీలను సృష్టించి వారిని వలంటీర్ల సాయంతో డప్పు కళాకారులుగా చిత్రీకరించి వారికి ఆన్‌లైన్ చేయ డంతో సుమారు ఏడుగురు నెలకు ఒక్కొక్కరు రూ.4 వేలు చొప్పున అంటే నెలకు రూ.28 వేల ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్నారు. ఈ నకిలీ పిం ఛన్లపై స్థానికులు ఎంపీడీవో, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసి రెండు నెలలవుతున్నా నేటికీ చర్యల్లేవ్.ప్రస్తుత సచివాలయ సిబ్బంది వారికి దర్జాగా పింఛను అందజేయడం కొసమెరుపు.

రేపే పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు నెల 1న పంపిణీ చేయవలసిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నారు.ఒకటవ తేదీ ఆదివా రం కావడంతో ఉద్యోగులకు కూడా ఇబ్బంది కలగకుండా 31వ తేదీ ఉదయం 5 గంటల నుంచే పంపిణీ ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 512 సచివాలయాలు 9041 క్లస్టర్ల పరిధిలోని 2,39,152 మంది లబ్ధిదా రులకు 5,169 మంది అధికారులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఉదయం 5 గంటలకు పంపిణీ ప్రారంభించి మధ్యాహ్నం 12గంటల లోపు పూర్తి చేయాల న్నారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకూ పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. ఎవరైనా తీసుకోని వారుంటే 2న సోమవారం పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలో డీఆర్‌డీఏ పీడీ ఆధ్వర్యం లో ఎంపీడీవోలు అంతా కంట్రోలు రూమ్ విధు ల్లో ఉండాలన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ఈనెల 31న లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.



జెండా ఊపి 3కె రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

క్రీడలతో మానసికోల్లాసం

జాతీయ క్రీడా దినోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : క్రీడలతో విద్యార్థులకు శారీక దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం పెరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని వై. జంక్షన్ నుంచి గోదావరిగట్టు ఇస్కాన్ టెంపుల్ వరకూ 3కె రన్ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ఒక అలవాటుగా మార్చుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఆగస్టు 29న ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా ఆ రోజున జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న పలువురు క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్సు అధికారి శేషగిరిరావు, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్, గౌతంరాజు, జగన్నాథం, పీటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

జాతీయ స్థాయిలో టైక్వాండో 73 కిలోల విభాగంలో వెండి పతకం సాధించిన గుబ్బల మేరీగోల్డ్, జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ 73 కిలోల విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకున్న నల్ల ప్రజ్ఞ, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ టేబుల్ టెన్నిస్‌లో పాల్గొన్న గౌతమ్, జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్ 13 విభాగంలో పాల్గొన్న వెంకట చైతన్య, 46వ జాతీయ స్థాయి ఇండియన్ మాస్టర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లో పాల్గొన్న రుద్రకుమార్, జాతీయ జూనియర్ మహిళల 97 కిలోల కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన దివ్యశ్రీ, అంతర్జాతీయ మానస్ ఇండో బంగ్లా ఫ్రెండ్‌షిప్ కప్ 2023 వీల్‌ఛైర్ క్రికెట్ టీం టీ 20లో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్, 3వ జాతీయ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ విభాగంలో బంగారు పతకం సాధించిన కిరణ్మయి, 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో 2023-24 అండర్ 19 విభాగంలో బాక్సింగ్‌లో పాల్గొన్న అక్షిత, 2వ ఎన్‌వైఎస్ఎఫ్ జాతీయ యోగ పోటీల్లో పాల్గొని గిన్నిస్ రికార్డు సాధించిన సాత్వికలను సన్మానించారు.

వనం మనం విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 29 : హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఒక సామాజిక బాధ్యతగా చేపట్టి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం డివిజన్, మండల స్థాయి ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వనం మనంపై దిశానిర్దేశం చేశారు.ఈ మేరకు నవంబరు 1 వరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. తల్లిపేరుతో ఒక మొక్క నాటి వాటి విషయంలో పరిరక్షణ చేపట్టాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం ఎంపీడీవోలు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వఆఫీస్‌లు, పాఠశాలలు, కాలేజీలు, పరిశ్రమల ఆవరణాల, కెనాల్ బండ్లు, శ్మశాన వాటికల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపటాలన్నారు.

కొవ్వూరులో కట్..కట!

- రోజంతా తాగునీరందక ఇక్కట్లు
- గత నెల రోజులుగా సమస్య
- తరచుగా మోటార్లకు మరమ్మతులు
- అల్లాడిపోతున్న ప్రజానీకం
- గోదారి చెంతనే ఉన్నా ఇంతే..

కొవ్వూరు, ఆగస్టు 29 : అఖండ గోదావరి చెంతనే ఉన్నా గొంతెండిపోతోంది.. గత నెల రోజులుగా సమస్య ఉన్నా కనీసం కన్నెత్తి చూసిన అధికారులు లేరు.. దీంతో కొవ్వూరు పట్టణవాసులకు దాహం కేకలు తప్పడం లేదు. నాలుగు దశాబ్దాల కిందట వేసిన పైపులైను కావడంతో తరచూ మరమ్మతులతో ప్రజలకు తాగునీటి వెతలు తప్పడం లేదు. తాగునీరు అందించడం లేదని కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేసి 24 గంటలు గడవక ముందే బుధవారం అర్ధరాత్రి మునిసిపల్ మెయిన్ వాటర్‌వర్క్సులో 40 హెచ్‌పీ మోటారులో మంటల ఎగసిపడి కాలిపోయింది. దీంతో పట్టణంలోని 23 వార్డులకు గురువారం తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది హుటాహుటిన మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, పబ్లిక్‌హెల్త్ డీఈ డి.సత్యనారాయణ పనులు పర్యవేక్షించారు. తరచూ మరమ్మతులకు గురవడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో 12,982 కుటుంబాలు..

కొవ్వూరు పట్టణంలో మునిసిపల్ లెక్కల ప్రకారం 12,982 కుటుంబాలు, 39,706 మంది జనాభా ఉన్నారు. పట్టణంలో సుమారు 50 కిలోమీటర్లు పైపులైను ద్వారా ప్రజలకు త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే 1984 సంవత్సరంలో వేసిన పైపులైను కావడంతో ఎక్కడో ఒకచోట తాగునీటి పైపులైను లీకేజీలకు గురవుతున్నాయి.అప్పట్లో పట్టణంలో 1000 కుళాయి కనెక్షన్లు ఉండేవి. ప్రస్తుతం 4950 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. విస్తరిస్తున్న పట్టణం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తమోటార్లు, పైపులైను నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో తరచుగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తప్పడం లేదు. వాటర్ వర్క్సులో ఉన్న రెండు మోటార్లు మూడు రోజుల వ్యవధిలో మరమ్మతులకు గురై ప్రజలు దాహంతో అల్లాడారు. ఇటీవల పట్టణంలో గత ప్రభుత్వం మంజూరుచేసిన 4 జగనన్న కాలనీలకు తాగునీరు పూర్తిగా అందడం లేదు. ప్రస్తుతం వాటర్‌ట్యాంకుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. దీనికితోడు ఇందిరమ్మకాలనీ, అచ్చాయమ్మకాలనీ, యానాదికాలనీ, రాజీవ్‌కాలనీ, బ్రిడ్జిపేటలలోని ప్రజలకు వాటర్‌ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మరో పక్క లీకేజీల మరమ్మతుల పేరుతో గుంతలు తవ్వి ఎక్కడికక్కడ రోజుల తరబడి వదిలివేయడంతో ఆ గుంతల్లో వర్షపునీరు చేరి తాగునీరు కలు షితం అవుతుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.గత ప్రభుత్వంలో తాగునీటి ఇబ్బందులను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో గోదావరి జలాలు శుద్ధిచేసి పట్టణ ప్రజలకు అందించడానికి కొవ్వూరు మునిసిపాలిటీకి ఏఐబీ నిధులు రూ.58 కోట్లు మంజూరు చేసింది. ఈ పథకంలో 2 ప్యాకేజీలుగా పనులు ప్రారంభించినా పూర్తికాలేదు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు : చైర్‌పర్సన్

కొవ్వూరు, ఆగస్టు 29 : ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు మునిసిపాలిటీ ప్రధాన వాటర్‌వర్క్సులో 40 హెచ్‌పీ మోటారు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం అర్ధరాత్రి కాలిపోయింది. దీంతో గురువారం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలనుంచి ఫిర్యాదులు రావడంతో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, పబ్లిక్ హెల్త్ డీఈ డి.సత్యనారాయణ, కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు వాటర్‌వర్క్సును సందర్శించారు. మోటారు కాలిపోవడానికి గల కారణాలను ఏఈలు కె.సుమంత్, పి.దుర్గాకిశోర్‌లను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన మోటారు స్థానంలో స్టాండ్ బై ఉన్న 30 హెచ్‌పీ మోటారును పంపునకు అమర్చి సాయంత్రానికి తాగునీటి సరఫరాను కొంతమేర పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయానికి పూర్తిస్థాయిలో వాటర్ సరఫరా చేస్తామని ఏఈలు దుర్గాకిషోర్, కె.సుమంత్‌లు తెలిపారు. రూ. 5 లక్షలతో కొత్త మోటారు, పంపుసెట్ కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.



పైప్‌లైన్ పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి



మోటార్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మాతృ భాషపై మమకారం

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్



రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఒక న్యాయాధికారి మాతృ భాషపై మమకారం చాటుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సెల్ ఫోన్ చోరీ కేసులో 2022లో ఇద్దరిపై కేసు నమోదైంది. రెండేళ్లగా కొనసాగుతున్న ఈ కేసు గురువారం మొదటి శ్రేణి రెండో అదనపు న్యాయాధికారి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ బెంచిపైకి వచ్చింది. ఆయన విచారించి నేరం రుజువు కాకపోవడంతో నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ తెలుగులో తీర్పు వెలువరించారు. అంతే కాకుండా తీర్పు కాపీని కూడా తెలుగులోనే ఇచ్చారు. అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మన భాషను మించిన భాష లేదన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తెలుగు భాషను ప్రోత్సహించడానికి తన వంతు కృషిలో భాగంగా 2018 నుంచి తెలుగు భాషా దినోత్సవం రోజున ఏదో ఒక కేసులో తీర్పును తెలుగులో చెప్పడం అలవాటు చేసుకున్నానన్నారు. కక్షిదారులకు అర్థమయ్యేలా వారి మాతృ భాషలో తీర్పులను తర్జుమా చేసి ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానాలు సైతం చెప్తున్నాయని గుర్తు చేశారు. తెలుగు భాష చాలా గొప్పదని, మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేయాలన్నారు. కృష్ణప్రసాద్‌ను పలువురు అభినందించారు.



తెలుగు భాష తియ్యదనం

అమ్మలాంటి అనురాగం... అమృతంలాంటి కమ్మదనం కల తెలుగు మన మాతృ భాష కావడం అదృష్టమని ఓక్‌వుడ్ స్కూలు చైర్మన్ కె.రాంబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు బీజాపురి టౌన్‌షిప్‌లో గల ఈ స్కూలు విద్యార్థులు గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. - దివాన్‌చెరువు



రుద్రాక్షలతో

వినాయకుడు, శివలింగం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన కోలా వీరబాబు ఐదు వేల రుద్రాక్షలతో నాలుగు అడుగుల వినాయక విగ్రహాన్ని, మూడు అడుగుల శివలింగాన్ని తయారు చేశాడు. వినాయకచవితికి వీటిని ప్రత్యేకంగా ప్రతిష్ఠిస్తానని ఆయన చెప్పాడు. - గొల్లప్రోలు

బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తెస్తాం



ఉమ్మడి జిల్లాలో 2 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు లక్ష్యం

అల్లూరి జిల్లాలో కొత్తగా 400 సెల్ టవర్ల ఏర్పాటు

3జీ సిమ్‌లను తీసుకొచ్చి 4జీ సిమ్‌లను ఉచితంగా పొందండి

బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు

అమలాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌కుపూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఉమ్మడి జిల్లా ఐటీఎస్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో 2లక్షల బీఎస్ఎన్ఎల్ ఫోన్ కనెక్షన్లు ఉండేవని, నేడు అవి 10వేలకు పడిపోయాయన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ టాటా కన్సల్టెన్సీతో ఒప్పందం కుదుర్చుకుని శరవేగంగా ముందుకు సాగుతోందని వివరించారు. జిల్లాలో 2 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని, త్వరలోనే ఆ లక్ష్యాన్ని సాధిస్తామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాలకు సైతం బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరిస్తామని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద డీఈ పీఎస్ఎల్ నరసింహారావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం రాజు మాట్లాడుతూ లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగీ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ మండలాల్లో సైతం బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరించనున్నామన్నారు. తక్కువ ఖర్చుతో మంచి సేవలందించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వరంగ సంస్థ కావడం వల్ల ప్రజలకు అందుబాటులోనే టారిఫ్‌లు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే ప్రముఖ సంస్థల నుంచి ఖాతాదారులు బీఎస్ఎన్ఎల్‌లోకి మారుతున్నారని, త్వరలో మరింత వేగం పెరుగుతుందన్నారు. తొలుత సంస్థ కార్యాలయం వద్ద బీఎస్ఎన్ఎల్ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిబ్బందితో కలిసి పట్టణ వీధుల్లో చేపట్టిన మోటారు సైకిళ్ల ర్యాలీలో జీఎం పాల్గొని పలుచోట్ల మాట్లాడారు. రాజమహేంద్రవరం డీజీఎం వి.రాజశేఖర్‌బాబు, కాకినాడ డీజీఎం డి.సైదానాయక్, రాజమహేంద్రవరం డీజీఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రాజమహేంద్రవరం ఏజీఎం మార్కెటింగ్ అండ్ ఈబీ బొమ్మిడి శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఏజీఎం వి.శారదాదేవి, ఏజీఎంలు టి.జయశ్రీ, వైశైలజ, మంగళంపల్లి అంజిబాబు, పెనుమాల చిట్టిబాబు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేలా తీసుకుంటున్న చర్యలను జనరల్ మేనేజర్ రాజు ఇలా వివరించారు.

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 400 బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు ఉన్నాయి.
- సీఎండీ ఆదేశాలతో కొత్తగా 50 సెల్ టవర్లు మంజూరు కాగా కోనసీమ జిల్లాకు ప్రత్యేకంగా 20 కేటాయించారు.
- ప్రధానమంత్రి అంత్యోదయ పథకంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని 11 ఏజెన్సీ మండలాల్లో కొత్తగా 400 సెల్ టవర్లు ఏర్పాటు చేస్తాం.
- ఇప్పటి వరకు ఏజెన్సీ మండలాల్లో జియో, ఎయిర్‌టెల్ వంటి సర్వీసులు కూడా అందని ప్రాంతాల్లో ఈ సెల్ టవర్లు ఏర్పాటు చేస్తాం. అక్టోబరు నెలాఖరు నాటికి 90 శాతం సెల్ టవర్ల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యం.
- బీఎస్ఎన్ఎల్‌లో ఇప్పటికే 2జీ, 3జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా 4జీని తీసుకువచ్చాం. 3జీ సిమ్‌లను తీసుకువచ్చి 4జీ సిమ్‌లను ఉచితంగా పొందొచ్చు. 4జీ సిమ్‌లతో హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తాము.
- త్వరలోనే 5జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.
- ఉమ్మడి జిల్లాలో 5.50లక్షల మొబైల్ ఫోన్లు బీఎస్ఎన్ఎల్‌లో ఉన్నాయి. ఈ నెల 30వేలు కనెక్షన్లు అదనంగా పొందాల్సి ఉండగా ఇప్పటికే 26వేల కనెక్షన్లు సాధించాము. గత నెలలో 24వేల కనెక్షన్లు పొందాము..



ప్రచారంలో నినాదాలు చేస్తున్న జనరల్ మేనేజర్ రాజు, ఉద్యోగులు

నేడు రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 29: అన్నవరం దేవస్థానంలో శ్రావణ శుక్రవార వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఆసక్తి గల మహిళలు కొబ్బరికాయ, అరటిపళ్లు, పువ్వులు తీసుకొస్తే మిగిలిన ద్రవ్యాలను దేవస్థానం అందజేస్తుందని చెప్పారు.

6న జడ్పీ సాధారణ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, ఆగస్టు 29: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాధారణ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలను సెప్టెంబరు 6వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధి కోర్సులకు మూడు నెలలు ఉచిత శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: పీఎంకేవీవై 4.0 పథకంలో భాగంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఇన్‌స్టలేషన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండిషనర్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థుల వయసు 45 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ జెరాక్స్, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, ఇంటర్ పాస్ సర్టిఫికెట్, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తదితర వివరాలతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో సెప్టెంబరు 3వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8790798431 నెంబరును సంప్రదించాలని చెప్పారు.



సత్యదేవుని సన్నిధిలో అనంతపురం ఎంపీ

అన్నవరం, ఆగస్టు 29: రత్నగిరిపై వేంచేసియున్న సత్యదేవుని అనంతపురం ఎంపీ బీకే పార్థసారధి గురువారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈవో సస్పెన్షన్

ద్రాక్షారామ, ఆగస్టు 29: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయం ఈవో పీటీవీ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆలయానికి రథం తయారీతో పాటు పలు ఆరోపణలపై మంత్రి సుభాష్ ఈవోపై విచారణ జరిపించారు. ఇటీవల దేవదాయ శాఖ ఆర్జేసీ కె.సుబ్బారావుతో పాటు అధికారులు రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరిపి కమిషనరుకు నివేదిక అందజేశారు. రథం తయారీకి దాతల నుంచి చందాలు వసూలు చేయడంలో నిబంధనలు పాటించకపోవడం, కమిషనరు అనుమతి తీసుకోకపోవడం కారణంగా చూపించి ఈవోను సస్పెండ్ చేశారు.

సంజయ్ కలాసీ సేఫ్!

నేడు పోలీసుల ముందుకు కిడ్నాపర్లు!

మధ్యవర్తి ద్వారా పోలీసులతో మంతనాలు

స్వచ్ఛందంగా లొంగుబాటుకు అంగీకారం







అపహరణకు గురైన సంజయ్ కలాసీ (ఎడమ), నిందితులు మున్నా, స్వామినాయుడు (కుడి)

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన చేపల వ్యాపారి సంజయ్ కలాసీని అపహరించిన ఘటనలో నిందితులు మధ్యవర్తి ద్వారా పోలీసులతో మాట్లాడారని తెలుస్తోంది. సంజయ్ కలాసీ అమలాపురం, తుని పరిసర ప్రాంతాల్లో చేపల రైతుల వద్ద నుంచి సరుకు కొనుగోలు చేసి ఒడిశా తీసుకెళ్తాడు. ఓ ఐదారు నెలలు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించాడు. దీంతో స్వామినాయుడు అనే మధ్యవర్తి కమీషన్ కోసం పలువురు రైతుల వద్ద నుంచి సంజయ్‌కు సరుకు ఇప్పించాడు. ఈ క్రమంలో సుమారు రూ.3 కోట్లు బకాయిపడ్డాడు. వివిధ పోలీస్ స్టేషన్లలో అతడిపై ఏడు కేసులు ఉన్నాయి. కలాసీపై పోలీసులకు ఫిర్యాదు చేయడం.. వారు అరెస్టు చేయడం.. జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ఒడిశా వెళ్లిపోవడం జరుగుతోంది. ఇలా మూడేళ్ల నుంచీ వేధిస్తున్నాడు. అందరూ తెలిసినవాళ్లు కావడంతో రోజూ తమ బాకీల కోసం అడుగుతుండడంతో స్వామినాయుడు వారి కంటపడకుండా ఊరు విడిచి తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో విసుగు చెందిన స్వామినాయుడు జైలు నుంచి విడుదలయ్యే సమాచారం తెలుసుకుని అపహరించాడు. దీనిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేసి ఆరు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. అమలాపురం, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు ప్రాథమికంగా తెలుసుకున్నారు. ఈలోపు గురువారం ఒక మధ్యవర్తి పోలీసులతో మాట్లాడి నిందితులు వచ్చి లొంగిపోతారని, బకాయిలు వసూలు కోసమే వారు అలా చేశారని చెప్పారు. పోలీసులు సానుకూలంగా స్పందించడంతో శుక్రవారం ఉదయం పోలీసుల ముందుకు నిందితులు వచ్చే అవకాశం ఉంది. బాధితుల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గ్రామానికి చెందిన వాళ్లే ఎక్కువ మంది ఉన్నారని చెప్తున్నారు. దీంతో ఆయన స్వయంగా రంగంలోకి దిగి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన విధానం కాదని మందలించడం, నిందితులు నేరస్వభావం కలిగిన వారు కాకపోవడం వల్ల పోలీసుల ముందుకు రావడానికి ఒప్పుకున్నారని తెలుస్తోంది. అపహరణకు గురైన సంజయ్ కలాసీకి ఎలాంటి హానీ తలపెట్టలేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. సంజయ్.. అతడిని అపహరించిన నిందితులంటూ స్వామినాయుడు, మున్నా ఫొటోలను ఎస్పీ కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. ఆచూకీ తెలిసిన వారు 9440796574, 9490760792 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు కోరారు.



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీ నరసింహారావు

పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా జరిగిందని కాకినాడ కమిషనర్ భావన అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల పరిధిలో ఉన్న 319 వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ హాలులో జరిగింది. ఆర్డీఎంఏ పరిధిలో అడ్మిన్ సెక్రటరీలకు మండపేట కమిషనర్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు పిఠాపురం కమిషనర్, శానిటేషన్ సెక్రటరీలకు తుని కమిషనర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ (ఎస్ఈపీహెచ్) పరిధిలోని ఎమినిటీ సెక్రటరీలకు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆర్డీటీసీపీ పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనర్ భావనతో పాటు అడిషనల్ కమిషనర్, రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు పర్యవేక్షించారు. ఉద్యోగుల కోరిక మేరకు కొన్ని బదిలీలు జరిగాయి. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, వితంతువులు, భార్యభర్తలు పరస్పర అవగాహనతో పలువురికి బదిలీలు చేపట్టారు. వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలు 20 మంది, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 41 మంది, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు 16 మంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు 18 మంది, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు 23 మంది, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు 40 మంది... మొత్తం 158 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 139 మంది హాజరయ్యారు. వీరందరికీ బదిలీల కౌన్సెలింగ్ చేశారు. బదిలీల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 31వ తేదీలోపు ఉత్తర్వులు అందజేస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో వరలక్ష్మీ వ్రత టోకెన్ల కోసం క్యూలైన్లలో కూర్చున్న మహిళలు

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

» పిఠాపురం పాదగయలో విస్తృత ఏర్పాట్లు » 12వేల చీరలు పంపించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ » టోకెన్ల కోసం మహిళల క్యూ

పిఠాపురం, ఆగస్టు 29: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణకు దేవదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు సరస్వతీదేవి మందిరం, చండీహోమం జరిగే ప్రాంతంలోనూ వ్రతాలు నిర్వహించనున్నారు. మూడు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌లో రెండువేల మంది మహిళలు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. వారికి పూజా సామగ్రిని సమకూర్చనున్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొనే మహిళలకు చీరలు, పసుపు, కుంకుమను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమకూర్చారు. 12వేల చీరలు పంపించినట్టు జనసేన వర్గాలు తెలిపాయి. పాదగయలో ఆరువేల మంది మాత్రమే వ్రతాలు ఆచరించే అవకాశం ఉంది. మిగిలిన వారికి టోకెన్లు ఇచ్చి చీరలు అందిస్తారని చెప్తున్నారు.

వరలక్ష్మీ వ్రతాల కోసం మహిళలకు టోకెన్ల జారీ గందరగోళంగా మారింది. సాధారణంగా పాదగయ అధికారులు టోకెన్లు ఇచ్చే సమయాన్ని ముందుగా ప్రకటిస్తారు. ఈసారి దానిని రహస్యంగా ఉంచడంతో పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఉదయం 9 గంటలకే వచ్చి క్యూలైన్లలో నిలుచున్నారు. వర్షానికి తడుస్తూ, ఉక్కపోతతో సతమతమవుతూ ఐదు గంటలకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. పాదగయ అధికారులు మధ్యాహ్నం 2.15 గంటలకు టోకెన్ల జారీ ప్రారంభించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. 2వేల మందికి టోకెన్లు పంపిణీ చేసినట్టు పాదగయ అధికారులు తెలిపారు. పలువురు మహిళలు తమకు టోకెన్లు అందలేదని ఈవో కార్యాలయం వద్ద సిబ్బందిని ప్రశ్నించడం కనిపించింది.

పాదగయలో వరలక్ష్మీ వ్రతం ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించినట్టు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వ్రతాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

కోలుకుంటున్న బాలికలు

ఏలేశ్వరం, ఆగస్టు 29: ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన వారిలో బుధవారం రాత్రి వరకు 32 మందికి వైద్య సేవలు అందించారు. గురువారం ఉదయం మరో ఇద్దరు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. మొత్తం 34 మందికి వైద్య సేవలు అందించగా వారిలో ఒకరిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం సాయంత్రానికి కోలుకున్న ఎనిమిది మందిని డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం 24 మందికి వైద్య సేవలు అందిస్తున్నామని, విద్యార్థినులు కోలుకుంటున్నారని డాక్టర్ శైలజ చెప్పారు.

ప్రతి పనిలోనూ ఏకాగ్రత ఉండాలి

క్రికెట్ క్రీడాకారుడు కోనా శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్)

పెద్దాపురం, ఆగస్టు 29: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. క్రికెట్ క్రీడాకారుడు కోనా శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలోని ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తాను భారతదేశం తరఫున 69 మ్యాచ్‌లు ఆడానని, ఇప్పటికీ ప్రాక్టీస్ చేస్తున్నానన్నారు. చేసే ప్రతి పనిలోనూ ఏకాగ్రత ఉండాలన్నారు. క్రమశిక్షణతో సాధన చేస్తే సాధించలేనిది అంటూ ఏదీ లేదన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థలు చదువుతో పాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యమివ్వడం గర్వకారణమన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన రాజేష్ కామిశెట్టి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విషయంలోనూ పోటీ పడాలని, అప్పుడే రాణించగలుగుతామన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. క్రికెటర్ భరత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ రామకృష్ణ, కో-ఆర్డినేటర్ ప్రశాంతి, ఉషా చైతన్య పాల్గొన్నారు.



శ్రీప్రకాష్ పాఠశాల ఆవరణలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్రికెటర్ శ్రీకర్ భరత్

ఏజెన్సీ సమాచారం

నర్సీపట్నం సబ్ కలెక్టర్ కల్పశ్రీ రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియామకం



నర్సీపట్నం, ఆగస్టు 29: నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా ఇటీవల నియమితులైన కేఆర్ కల్పశ్రీని అల్లూరి సీతా రామరాజు జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం స్థానంలో 2022 బ్యాచ్‌కి చెందిన కేఆర్ కల్పశ్రీని సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ గత ఆదివారం ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసింది. శిక్షణ పూర్తి చేసుకుని మొదటి పోస్టింగ్ నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా ఆమె విధుల్లోకి చేరకముందే రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే శిరీషదేవి



రంపచోడవరం, ఆగస్టు 29: రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ, జీపీఎస్ పాఠశాలల్లో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ) సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కోరారు. అమరావతిలోని సచివాలయంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ ఎస్.భార్గవిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొంతమంది సీఆర్టీలను విధుల్లోకి తీసుకోకపోవడం ద్వారా వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. సీఆర్టీలు అందరినీ విధుల్లోకి తీసుకొనేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, కె.కృష్ణమూర్తిదొర, కె.రణదీప్, లక్ష్మణ్, సీహెచ్ సత్యనారాయణ, డి.ఎరుకులరెడ్డి ఉన్నారు.

రైతులకు అటవీ శాఖ అధికారుల వేధింపులు

ఐటీడీఏ పీవోని కలిసిన ఎంపీటీసీ వెంకటరమణ



మోతుగూడెం, ఆగస్టు 29: వై.రామవరం, డొంకరాయి, శాంతినగర్, సింధువాడ గ్రామాల్లో నిరుపేద గిరిజన రైతులు అనేక దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీపీఎస్ ఆధారిత జియో ట్యాగింగ్‌లో సాంకేతిక లోపం, ఇతర కారణాలను సాకుగా చూపిస్తూ వారిని గడిచిన నెల రోజులుగా అటవీ శాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు. రైతులు ఎంపీటీసీ కరకా వెంకటరమణను సంప్రదించారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష సూచనల మేరకు ఆయన రైతులు కోరతాలి, వంతల సీతారాం, పాంగి రాజు, గెమ్మల సురేష్‌లతో కలిసి రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వద్దకు వెళ్లారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించగా పీవో స్పందించి రైతులు భయపడవద్దని, అన్ని విధాలా తోడుంటామన్నారు. నిర్భయంగా వ్యవసాయం చేసుకోవచ్చని హామీ ఇచ్చారు. పట్టాలు అందని వారికి త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో రైతులు సంతోషంతో పీవోకు, ఎమ్మెల్యేకు, ఎంపీటీసీకి ధన్యవాదాలు తెలిపారు.

ఇసుకను తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్నారు

విద్యుత్ శాఖ సిబ్బంది మామూళ్లు తీసుకుంటున్నారు

ఎటపాక మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



ఎటపాక, ఆగస్టు 29: గుండాల జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ ఇసుకను తెలంగాణకు అక్రమంగా తరలించుకుపోతున్నారని, పది టైర్ల లారీల్లో ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వొద్దని వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు కోరారు. గురువారం ఎటపాక మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కొందరు లైన్‌మన్‌లు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు మామూళ్లు తీసుకుంటున్నారని, వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని మంగేశ్వరరావు కోరారు. లో ఓల్టేజ్ సమస్య గురించి చెప్పినా ఆ శాఖ సిబ్బంది పట్టించుకోవట్లేదన్నారు. ఇటీవల జరిగిన గ్రామసభలకు గ్రామస్థాయి అధికారులు హాజరుకాలేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు పృథ్వీ, ఎంపీడీవో బాపన్నదొర, ఎంపీపీ కాకా కామేశ్వరి, జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఫార్మసీ ఆఫీసర్ పదోన్నతులను జీవో నెం.68కి అనుగుణంగా చేయాలి

కూనవరం, ఆగస్టు 29: ఏజెన్సీ ప్రాంతంలో ఫార్మసీ ఆఫీసర్ పదోన్నతులను జీవో నెం.68కి అనుగుణంగా చేయాలని ఆదివాసీ మెడికల్-హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు కోరారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఇస్తున్న జోనల్ స్థాయి ఫార్మసీ ఆఫీసర్ పదోన్నతుల్లో ఏజెన్సీ ప్రాంత పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శశిప్రకాష్, మడకం సతీష్‌కుమార్, సవలం జీవన్, అఖిల్, ఎస్.బాపిరాజు పాల్గొన్నారు.

అడ్డతీగలలో తెలుగు భాషా దినోత్సవం

అడ్డతీగల, ఆగస్టు 29: తెలుగు భాషను ముందు తరాలకు వారసత్వంగా అందజేయడం తెలుగు ప్రజల అందరి బాధ్యత అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు ఎస్ఆర్ స్వామి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐకేఎంఎస్ గౌరవాధ్యక్షుడు ఐ.రమణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జాతీయ క్రీడా దినోత్సవం కూడా నిర్వహించారు. గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ తైలవర్ణ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై ఏఎన్ఎం, వార్డెన్ల వేధింపులు

మారేడుమిల్లి, ఆగస్టు 29: ఆశ్రమ పాఠశాల విద్యార్థినులపై ఏఎన్ఎం, వార్డెన్ వేధింపులకు గురిచేస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మారేడుమిల్లి మండలం బోదులూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను ఏఎన్ఎం రామలక్ష్మి, వార్డెన్ మంగమ్మ తరచూ వేధిస్తున్నారని, వెట్టిచాకిరీ చేయిస్తున్నారని సర్పంచ్ హేమలతకు ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా తమకు తామర, గజ్జి ఉన్నాయంటూ మానసికంగా వేధించడమే కాకుండా బెత్తంతో కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి తమ అవస్థలను తీర్చాలని విద్యార్థినులు కోరారు.

ఘాటీ మలుపులో నిలిచిపోయిన లారీ



మోతుగూడెం, ఆగస్టు 29: మోతుగూడెం పరిధిలోని తులసిపాక-మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో భారీ లారీ నిలిచి పోయింది. మల్కాన్‌గిరి నుంచి రాజమహేంద్రవరం తవుడు లోడుతో వెళ్తున్న లారీ యాక్సిల్ విరిగిపోవడంతో వన దేవత గుడి వద్ద మలుపులో ఆగిపోయింది. దీంతో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పెద్ద సంఖ్యలో వాహనాలు ఆగిపోయాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతం. మోతుగూడెం పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఒకటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

రాజవొమ్మంగి, ఆగస్టు 29: సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తాము సూరిబాబు తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో బీజేపీ అరకు పార్లమెంటరీ కన్వీనర్ బీవీ భారతి మాట్లడుతూ సభ్యత్వ నమోదు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. బీజేపీ విస్తారక్ డీవీడీ ప్రసాద్, ఈశ శ్రీను, చోడి శివకృష్ణ, ఈశ చిన్ననాగరాజు, భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, లావేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో గురువారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ షేక్ షబ్నం విధుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపించిన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బందికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నన్నయ ఇన్‌ఛార్జి వీసీ



బిక్కవోలు: పందలపాకలో పిరమిడ్ ఆకారంలో విద్యార్థులు



రంగంపేట: చంద్రేడు హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

అమ్మభాష పరిరక్షణ అందరి బాధ్యత

● నన్నయ ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు

● ఘనంగా తెలుగు భాషాదినోత్సవం

దివాన్‌చెరువు, ఆగస్టు 29 : అమ్మభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం కార్యక్రమాలను గురువారం నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్యం నుంచి భాషపై పట్టుసాధించాలన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడలలో రాణించాలని కోరారు. ఖేలో ఇండియా నిధులుతో నన్నయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ పనులు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తెలుగుశాఖ అధ్యాపకుడు తరపట్ల సత్యనారాయణ, వ్యాయామవిద్యా కోర్స్ కోఆర్డినేటర్ బాల సత్యనారాయణ, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని అన్ని పాఠశాలల్లోను గురువారం తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పందలపాక ఉన్నత పాఠశాలలో ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్, తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పిరమిడ్ బిల్డింగ్ యోగాసనాలు, తెలుగు పాటలు ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, తెలుగు ఉపాధ్యాయిని పంపన వరలక్ష్మి, పీడీ యువరాజారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు పప్పు రామకృష్ణారెడ్డి, శివాజీ, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.వీరప్రభాకరరావు, పీడీ ధనరాజు, ఇళ్లపల్లిలో హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ క్రీడ, తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

జీజీయూలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

రాజానగరం: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జీజీయూ వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఉపకులపతి యు.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి, క్రీడల ప్రాముఖ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ జయానందకుమార్, ఫిజికల్ డైరెక్టర్ మంజ్రేకర్ హెన్రీ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ భాషను ప్రేమించాలి'

దివాన్‌చెరువు: అమ్మను గౌరవించాలి- అమ్మలాంటి భాషను ప్రేమించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయాచార్యుడు తలారి వాసు అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగుభాషాదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే విద్యార్థులు పాటలు, పద్యాలు, కవితలు, నాటికలు, సరదా సంభాషణలద్వారా భాషాభిరుచి ప్రకటించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎ.ఎస్.ఎన్.మూర్తి, ప్రిన్సిపాల్ విమల, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీతదితరులు పాల్గొన్నారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవంను వైభవంగా నిర్వహించారు. తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్‌పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాంతీయ విద్యాశాఖాధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు. సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో తెలుగుభాషాదినోత్సవం సందర్భంగా భువనవిజయం, పరమానందయ్యశిష్యులు వంటి నాటికలను ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు..



తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా సత్కరిస్తున్న విశ్వేశ్వరరెడ్డి



అనపర్తి: బాలికోన్నత పాఠశాలలో క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న దాత ద్వారంపూడి నారాయణరెడ్డి

రంగంపేట: బాల్యం నుంచి తెలుగు భాషపై మక్కువ పెంచుకొని భాషాభివృద్ధికి అందరూ కృషిచేయాలని జిల్లా సమగ్రశిక్ష ఏఎంవో గౌరీశంకర్రావు సూచించారు. గురువారం రంగంపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు కె.వి.వి.ఎన్.వరలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు రామ్మూర్తి పంతులు, ధ్యానచంద్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దాతల ఆశయ సాధనకు కృషి చేయాలి

అనపర్తి : దాతల ఆశయ సాధన కోసం ప్రతి విద్యార్థి కృషి చేయాలని అనపర్తిలోని ద్వారంపూడి బుల్లెమ్మాయి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కర్రి కళ్యాణి అన్నారు. గురువారం పాఠశాలలో నేషనల్ స్పోర్ట్స్‌డే, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు భాషా పితామహుడు గిడుగు రుద్రరాజు చిత్రపటానికి మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాత ద్వారంపూడి నారాయణరెడ్డి చేతుల మీదుగా విద్యార్థినులకు క్రీడా దుస్తులను, బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోనాల సత్తిరెడ్డి, ఎనస్కో ట్రస్టు చైర్మన్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అనపర్తిలోని కర్రి అప్పారావు జిల్లా పరిషత్ పాఠశాల లో తెలుగు భాషాభిమానుల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం ప్రతినిధులు కర్రి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుడు రవికిషోర్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడియం: పరభాషా సంక్రమణతో ఉనికిని కోల్పోతున్న తెలుగుభాష పరిరక్షణకు గిడుగు స్ఫూర్తితో మరో భాషా ఉద్యమానికి సన్నద్ధం కావాలని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి కళాసేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావులు పేర్కొన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవవరపు నీలకంఠరావు, బోణం సత్యనారాయణ, చిక్కాల ఈశ్వరరావు, తమ్మిశెట్టి ప్రసాద్, పున్నమిరాజు వీర్రాజు, డీటీపీఎస్ నాగేంద్ర, బొర్రా రామకృష్ణ, కేతా కృష్ణ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: తెలుగు భాష ఔనత్యాన్ని కాపాడుకోవాలని రాజమహేంద్రి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విశ్వేశ్వరరెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ ర చయితల సంఘం(అరసం), రాజమహేంద్రి మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గిడుగు రామ్మూర్తి జయంతి,తెలుగు భాషాదినోత్సవంలో ఆయన మాట్లాడారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాషను వాడుక భాషగా ప్రజల జీవభాషగా ముందుకు తీసుకువెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, రచయితలు ఆర్ఎస్.వరహాల దొర,గండి స్వామి ప్రసాద్,ఎస్ఆర్.పృథ్వీ,పీవీబీ.సంజీవరావు,బీహెచ్.రమాదేవి, సేవారత్న లోలబట్టు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

● తెలుగు వారందరికీ తెలుగు భాష నామోషీ కాదని..హితైషీ అని పలువురు వక్తలు అన్నారు.స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగులోనే మాట్లాడుదాం అంటూ ప్రమాణం చేసి సంతకాలు చేశారు.. రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కళాశాలలో చదివిన తాతా సత్య సందీప్ చక్కని అవధాన కర్తగా రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి, నగర టీడీపీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, నాయకురాలు కప్పల వెలుగు కుమారి, కొనకళ్ళ ఫణీంద్రరావు, సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు,కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్,సన్నిధానం శాస్త్రి, సీపీఎస్.కృష్ణారావు,సీపీ చౌదరి,తొక్కుల రమేష్,క్రొవ్విడి సుబ్రహ్మణ్యం,గుడిపూడి సునీల్,గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

కళాగౌతమి 33వ వార్షికోత్సవాలు

తెలుగు సంప్రదాయాలను ఎవరూ మరువరాదని తమిళనాడులోని తెలుగు భాషా ఉద్యమ నేత సంపే రమేష్ అన్నారు. కళాగౌతమి 33వ వార్షికోత్సవాల్లో భాగంగా వ్యవస్థాపకుడు బీవీఎస్.మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృభాషను విస్మరిస్తే మాతృభాష జ్ఞాన సంపద భావితరాలకు అందకుండా పోతుందన్నారు. రాజమండ్రి ఫైర్ డీఎఫ్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాచీన కవుల సాహిత్యం నుంచి నేటి ఆధునిక కవుల సాహిత్యం గొప్పదనాన్ని మనం విస్మరించరాదన్నారు.ఈ కార్యక్రమంలో నన్నయ ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ, జక్కంపూడి విజయలక్ష్మి, ప్రసిద్ధ నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్,శ్రీహరి జగన్నాథ్,పిల్ల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌కు నివాళి

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం సుంకర భాస్కరరావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాకీ క్రీడాకారుడు గుజ్జుల వినోద్‌బాబును సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సన్యాసిరావు, ఫుట్‌బాల్ క్రీడాకారుడు సీరా గంగాధరరావు, క్రీడా పరిశోధకులు సుంకర నాగేంద్రకిషోర్, ఎస్‌కేవీటీ కళాశాల వ్యాయామ అధ్యాపకులు పీవీ.కిషోర్‌బాబు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టౌన్ హాలుకి పూర్వవైభవం తీసుకువస్తాం: ఎమ్మెల్యే శ్రీనివాస్



క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రధానం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 29 : రాజమహేంద్రవరంలోని టౌన్ హాలును అభివృద్ధి చేసి పూర్వవైభవాన్ని తీసుకొస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలో టౌన్‌హాలును ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కూటమి నాయకులు వై.శ్రీను, కురగంటి సతీష్‌లతో కలిసి గురువారం పరిశీలించారు. వీరేశలింగంపంతులు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన టౌన్ హాలు నేడు దయనీయస్థితిలో ఉందన్నారు. వీరేశలింగం పంతులు ఇల్లు, టౌన్ హాలు అభివృద్ధిపై ట్రస్ట్ సభ్యులతో సమీక్షించి పూర్వవైభవం తీసుకువచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాజమండ్రిలో ఉమెన్ క్రికెట్ అకాడమి ఏర్పాటుకు చర్యలు

రాజమహేంద్రవరంలో ఉమెన్ క్రికెట్ అకాడమి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌కేవీటి కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన జాతీయ స్పోర్ట్స్‌డే వేడుకలకు హాజరై మాట్లాడారు. ధ్యాన్‌చంద్ సారథ్యంలో భారత హాకీ జట్టు మూడు సార్లు ఒలింపిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించారని గుర్తుచేసారు. ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని నేటి యువ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు.రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించి తీరుతామన్నారు. అనంతరం పలువురు క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తొలుత భారత హాకీ లెజెండర్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రీడలతో ఆరోగ్యం

● ఉషు ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం చేకూరుతుందని, దేహదారుఢ్యం సొంతమవుతుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హాలులో రెండు రోజుల పాటు జరిగే 9వ ఇంటర్ డిస్ట్రిక్టు ఉషు సీనియర్ అండ్ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదిశేషు, కార్యనిర్వాహకులు బి.నరసింహరావు, జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్షుడు అజ్జరపు వాసు, కార్యదర్శి ఆర్.సుందరం, పొన్నాడ బాబీ, వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో పరిశోధనల వైపు పయనించాలి

● జీజీయూలో ఘనంగా ప్రారంభమైన వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న జీజీయూ రిజిస్ట్రార్ శర్మ

రాజానగరం, ఆగస్టు 29: నవీన ఆలోచనలతో పరిశోధనల వైపు పయనించేందుకు ఈసదస్సు మంచి వేదిక అవుతుందని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)రిజిస్ట్రార్ పీఎంఎం ఎస్ శర్మ అన్నారు. భారత్ సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)ప్రారంభించిన వాణి పథకంపై గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో జీజీయూ పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ సౌజన్యంతో గురువారం వర్క్‌షాప్ ప్రారంభమైంది. విద్యుత్ వాహనాల వేస్ట్ బ్యాటరీ నుంచి పర్యావరణంపై పడుతున్న ఇటీవల పరిణామాలు అనే అంశంపై నిర్వహిస్తున్న ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ శర్మ మాట్లాడుతూ పారిశ్రామిక రంగ నిపుణులు, విద్యారంగంలో నిష్ణాతులైన వారి నుంచి నూతన విషయాలు తెలుసుకోవడంతో పాటుగా వారి ఆలోచనలను పంచుకోవడానికి మంచి విజ్ఞాన వేదికగా దోహదపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ మహమ్మద్ షరీఫ్, కో-కోర్డినేటర్ ఎన్వీఆర్ నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, డైరెక్టర్లు, డీన్లు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేను పరిశీలించిన డిస్ట్రిక్ట్ డీసీజర్

రాజానగరం, ఆగస్టు 29 :ఫీవర్ సర్వైవలైన్స్ పరిశీలనలో భాగంగా రాజానగరం శివారు సూర్యారావుపేటలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం డిస్ట్రిక్ట్ డీసీసర్ డాక్టర్ రాజీవ్ ఎంటమాలజిస్ట్ సుధీర్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఫీవర్ కేసులను విజిట్ చేసి, ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి జ్వరాల కేసులు గురించి ఆరా తీసి, ల్యాబ్ పరీక్షలు తనిఖీ చేశారు. ఉదయ ఏంజెల్ ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్లు ఎన్‌వీవీ రమణ, రత్నకుమారి పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులతో మేలైన దిగుబడులు

● తూర్పుగోనగూడెంలో పొలంబడిలో ఏవో ఇమామి ఖాసిం



రాజానగరం, ఆగస్టు 29: రైతులు సేంద్రియ పద్ధతులు అవలంభించడం ద్వారా సాగులో మేలైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిమ్ అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని తూర్పుగోన గూడెంలోని రైతులకు వరిసాగులో చేపట్టాల్సిన అంశాలపై గురువారం ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. వరి సాగులో రసాయన ఎరువులు అతిగా వినియోగం సిఫార్సు మేరకే వాడుతూ సేంద్రియ పద్ధతుల్లో సాగును చేపట్టాలని సూచించారు. అలాగే లింగాకర్షక బుట్టలు ద్వారా వరిలో కాండం తొలుచు పురుగు, రెక్కల పురులుల ఉధృతిని తెలుసుకోవడం, వాటి నివా రణకు ఎకరాకు 4 లేదా 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకో వాలన్నారు. అనంతరం క్షేత్రప్రదర్శన నిర్వహించారు. ఎఫ్‌పీవో ఈఈవో రత్నకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాబార్డు అందించే పథకాలను వివరించారు. ఈకార్యక్రమంలో రైతులు అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, గల్లా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

'వాక్కాయలో పోషక విలువలు మెండు'

రాజానగరం, ఆగస్టు 29: వాక్కాయ(కరోండ)లో పోషక విలువలు పుష్కలంగా ఉండటమే కాకుండా అధిక ఐరన్, విట మిన్ సి రక్తహీనతను నివారించడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో దోహదపడతాయని కేవీకే గృహవిజ్ఞాన వి భాగం అధికారి సంజయ్ వినాయక్ హెగ్డే అన్నారు. మండలంలో కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలోని గృహ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో కరోండ(వాక్కాయ)తో విలువ ఆధారిత పదార్థాల తయారీపై ప్రథమశ్రేణి ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వాక్కాయలోని పోషక విలువలు, వాటి ఉపయో గాలు, వాక్కాయతో జాము, కట్ట మీటా చట్నీ, చెర్రీ రకాలు తయా రీ, పచ్చడి, సిరప్ తదితర తయారీపై శిక్షణ, ప్రదర్శన నిర్వహించారు. భవిష్యత్తులో మహిళా సాధికారత కోసం కూర గాయలు, పండ్లు, మాంసాహార ఉత్పత్తులను తయారు చేసి, కుటీర పరిశ్రమలు స్థాపించే దిశగా శిక్షణ, అవగాహన కార్యక్ర మాలను కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టనున్నట్లు నాయుడు, సంజ య్ వివరించారు. ఈకార్యక్రమంలో కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు, సంజయ్ వినాయక్ హెగ్డే, జేవీఆర్ సత్యవాణి, బి.నాగేశ్వరరెడ్డి, రఘునందన్, విజయవర్ధన్, రత్నాజీ, వేమగిరి, కడియం, బొమ్మూరు, రాజమహేంద్రవరం రూరల్ మండలాలకు చెందిన మహిళలకు అవగాహన,శిక్షణ, ప్రథమ శ్రేణి ప్రదర్శన నిర్వహించారు.

అనపర్తి అభివృద్ధిపై సీఎంతో చర్చించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



చంద్రబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 29: అనపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చర్చించారు. గురువారంరాత్రి వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి నియోజకవర్గ అభివృద్ధిపై పలుఅంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల ప్రతి పాదనలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చానని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని అవసర మైన నిధులు కేటాయిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు.

వర్తక సంఘం సహాయ కార్యదర్శి శేషుబాబు మృతి



అనపర్తి, ఆగస్టు 29 : అనపర్తి వర్తక సంఘం సహాయ కార్యదర్శి వెత్సా శేషుబాబు(48) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. తన తండ్రి స్వర్గీయ వెత్సా వెంకన్నబాబు వారసుడిగా వర్తక సంఘంలో అనేక పదవులు నిర్వహించారు. శేషుబాబు మృతితో గురువా రం గ్రామంలోని ఎలక్ట్రికల్ దుకాణాలు మూసివేసి శేషు బాబు మృతికి నివాళ లర్పించారు. శేషుబాబు మృతిపట్ల వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, గౌరవాధ్యక్షుడు సత్తి వెంక్రటామారెడ్డి, వర్తక సంఘం కార్యవర్గ సభ్యులు, వర్తకులు సంతాపం తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : నూజివీడు ట్రిపుల్ ఐటీ హాస్టళ్లలో కలుషిత ఆహారం తిని అనారోగ్యం పాలైన విద్యార్థులకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందజేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టిపెట్టాలన్నారు.

'డ్వాక్రా సంఘాల్లో అవకతవకలపై దర్యాప్తు జరపాలి'

కడియం, ఆగస్టు 29: గ్రామంలో ఉన్న మహిళా సంఘాలలో జరిగిన అవకతవకలపై ఉన్నతస్థాయి అధికారులు దర్యాప్తు జరపాలని కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి వెంకటరామారావు(రాంజీ) పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామ పరిధిలో ఓ మహిళా సంఘంకు సంబంధించి బ్యాంకు చెల్లించే వాయిదాల విషయంలో వీవోఏ అవకతవకలకు పాల్పడ్డారంటూ సంఘ సభ్యులు ఇటీవల జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారన్నారు. గ్రామంలో మూడు సంఘాలకు సంబంధించి లక్షలాది రూపాయలు డ్వాక్రా ఏనిమేటర్ అవకతవకలకు పాల్పడ్డారని మహిళా సంఘాల సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారని రాంజీ తెలిపారు. కడియపులంక గ్రామ పరిధిలో ఉన్న అన్ని మహిళా సంఘాలను పరిశీలిస్తే మరిన్ని అవకతవకలు బయట పడే అవకాశం ఉందన్నారు.



కొవ్వూరు కమిషనర్‌గా నాగేంద్రకుమార్



కొవ్వూరు, ఆగస్టు 26 : కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌గా టి.నాగేంద్రకుమార్ నియమితులయ్యారు. పలాస కాశిబుగ్గ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ నాగేంద్రకుమార్ బదిలీపై కొవ్వూరు రానున్నారు. ఇప్పటి వరకు కొవ్వూరు కమిషనర్‌గా ఉన్న కె.డానియేల్ జోసెఫ్ కనిగిరి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లనున్నారు.



జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఆసుపత్రి భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందికి ఎస్పీ ఆదేశం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వచ్చిన ఆయన గురువారం ఆసుపత్రి సెక్యూరిటీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలోని వైద్యులు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బందితో పాటు చికిత్సకు వచ్చే రోగుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమైన, అత్యంత కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ శర్మ,పోలీసులుపాల్గొన్నారు.

వైద్యసేవలపై ఫిర్యాదులు సహించను : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : వైద్యసేవల్లో జవాబుదారీతనం అవసరమని.. ఎన్టీఆర్ ఆరోగ్య వైద్యసేవలను ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణ కమిటీ సభ్యులతోను సమీక్ష జరిపారు. వైద్యసేవలందించే క్రమంలో లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇలాంటి ఫిర్యాదులకు సంబంధించి బిల్లుల చెల్లింపు నిలుపుదల చేస్తామన్నారు. పరీక్షలు, వైద్యసేవలు ఉచితంగా అందించాలన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యసేవలకు మూడు షిఫ్టుల్లో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. రోగిని డిశ్చార్జి చేసే సమయంలో పది రోజులకు సరిపడా మందులు, రవాణా ఛార్జీలు ఇవ్వాలన్నారు. నగదు వసూలు, సరైన చికిత్స లేదని, మౌలిక వసతులు కల్పించడంలేదని 11 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్యసేవ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో వరి చేను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కలుపు నివారిస్తే.. పొడ తెగులు ఆశించదు

ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్

కొవ్వూరు/తాళ్లపూడి, ఆగస్టు 29 : కలుపు నివారణ ద్వారా వరి పంటలో పొడ తెగులు ఆశించకుండా నివారించవచ్చునని రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ అన్నారు. కొవ్వూరు మండలం ధర్మవరం,తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామాల్లో వరి పంటను శాస్త్రవేత్త మానుకొండ శ్రీని వాస్, మార్టేరు పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సిహెచ్.శ్రీనివాస్, కొవ్వూరు వ్యవసాయశాఖ ఏడీ పి.చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సార్వాలో వరి పంటను పొడ తెగులు ఆశించకుండా కలుపు నివారణ తప్పనిసరి అన్నారు. పొడతెగులు లక్షణాలు నీటికి దగ్గరగా ఉన్న కాండంపై బూడిద నుంచి తెలుపురంగు మచ్చలు, గోధుమరంగు అంచులతో ఆకులు, కాడలపై కనిపిస్తాయన్నారు. ప్రస్తుతం వరి పంట పొలాలలో పొడ తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని రైతులు పొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ లేదా వాలిడామైసిన్ లేదా ప్రోపికోనజోల్‌లలో ఏదో ఒక మందును అధికారుల సూచనలతో పిచికారీ చేయాలని సూచించారు.

అక్రమంగా 164 ఎకరాలు అమ్మేశారు : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : గోపాలపురం మండలం భీమోలు భూములకు సంబంధించి చోటుచేసుకున్న ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తమకు హామీ ఇచ్చారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెల్లడించారు. ఈ మేరకు గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నాయకత్వంలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలపై రెవెన్యూ మంత్రికి జిల్లాల వారీగా నివేదికలు అందజేసినట్టు తెలిపారు. భీమోలులో అక్రమంగా సుమారు 164 ఎకరాల భూములను అనపర్తి రెడ్లకు అమ్మేశారని, దీనిపై విచారణ జరిపించాలని మంత్రిని కోరగా ఆయన విచారణ జరిపిస్తామని తమకు స్పష్టం చేశారని మధు పేర్కొన్నారు.

తెలుగు..వెలగాలి!

అమ్మ భాషను మర్చిపోకూడదు : కలెక్టర్



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఆగస్టు 29: మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత.. అమ్మ భాషను మర్చిపోతే అమ్మను మర్చిపోయినట్టే.. ప్రతి తెలుగువాడు తెలుగు భాషా పరిరక్షణకు పాటుపడాలి.. తెలుగు. వెలగాలి.. అంటూ కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి 162వ జయంతిని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు నివాళుల ర్పించి మాట్లాడారు. వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు అన్నారు. మన మాతృభాషను గౌరవించడం ముఖ్యమన్నారు. నేడు తెలుగు భాషను మర్చిపోయే స్థితికి రావడం దురదృష్టకరమన్నారు. తెలుగు వారు ప్రతి ఒక్కరు ఖచ్చితంగా తెలుగులో మాట్లాడాలి, చదవాలి, రాయాలన్నారు. అనంతరం సాహిత్య పద్యాలు, కవితలు పాటలను ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బి.ఏసుబాబు ఆలపించారు. గిడుగు జీవిత విశేషాలను విద్యార్థి కిషోర్, వాడుక భాషపై విధేయత ఇచ్చిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులను, విద్యార్థులను కలెక్టర్ సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు తెలుగుపై తమకు ఉన్న మమకారాన్ని ఇలా చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జేసీ చిన్న రాముడు, డీఆర్వో జి.నరసింహులు, డీఈవో కే వాసుదేవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆ..కట్టు..నేల.. ఇదీ మన సంప్రదాయం



అమ్మభాషపై మమకారం.. అక్షరంగా మారిన తరుణం..

నేడు, రేపు ప్రత్యేక వైద్యశిబిరాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : ప్రస్తుతం సీజన్లో వస్తున్న జ్వరాల నేపథ్యంలో ప్రజల కోసం ఈ నెల 30, 31 తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలోని సంబంధిత పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు 57 వైద్య శిబిరాలు నిర్వహించి జ్వరం కేసులు 246 గుర్తించారన్నారు.మరో రెండు రోజుల పాటు వైద్యశిబిరాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.



పింఛన్లలో.. నకిలీలు!

ఇష్టానుసారంగా పింఛన్లు పంపిణీ

- అనర్హులకు అందలం
- వినిపించదు..కనిపించదు?
- నకిలీ సర్టిఫికెట్ల బాగోతం
- నాడు వలంటీర్ల చేతివాటం
- నేటికీ గ్రామగ్రామాన అందజేత
- పట్టించుకోని అధికారులు
- అర్హులకు సవాలక్ష నిబంధనాలు
- వేలాదిగా దరఖాస్తులు పెండింగ్

గోపాలపురం, ఆగస్టు 29 : పింఛన్లు ఇష్టానుసారం ఇచ్చేస్తున్నారు.. అర్హులెవరు.. అనర్హులెవరు కనీసం దృష్టి సారించడంలేదు..గత ప్రభుత్వంలో కొంత మంది వలంటీర్లు ఇష్టారాజ్యంగా అర్హత ఉన్నా లేకపోయినా దొంగ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి తమ బంధువులకు పింఛన్లు మంజూరు చేయించుకున్నవారు ఉన్నారు. రాజకీయ పలుకుబడితో కొందరు ఉన్నారు. ఇలా ప్రతి గ్రామంలో ఉన్నట్టు సమాచారం. జిల్లా వ్యాప్తంగా సుమారు 10 శాతం అనర్హులు ఉంటారనేది ఒక లెక్క. అవి ప్రభుత్వం మారినా నేటికీ కొనసాగుతున్నాయి. పింఛన్లు తీసుకుంటున్న వారిలో అక్కడక్కడా నాటి వైసీపీ నాయకులు ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తుండడంతో ఉన్నతాధికారులు ఒక నెల డ్రైవ్ పెడితే అనర్హులు చిక్కే అవకాశం ఉంది.

అర్హులకు సవాలక్ష ఆంక్షలు..

జిల్లాలో అర్హత కలిగిన పింఛనుదారులు వాటిని పొందేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం మారినా నేటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయడంలేదు. దరఖాస్తులు మాత్రం వేలల్లో ఉన్నట్టు సమాచారం. అయితే అర్హులు మాత్రం పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారోనని ఎదురు చూస్తున్నారు. నేటికీ కదలిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హతలు ఉన్న ఆర్థిక స్తోమత లేకపోవడం.. అధికారులకు ఆమ్యామ్యాలు చెల్లించలేకపోవడం తదితర కారణాలతో అర్హులకు పింఛన్లు మంజూరుకావడం లేదు.కొంత మందికి అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో వెలితి చూపుతూ పింఛను పొందుతున్నారు. గత పాలకుల పాపంతో నకిలీ సర్టిఫికెట్ల ద్వారా ప్రతి నెల వేలాది రూపాయల సామాజిక భద్రత పింఛన్లు ఏళ్ళ తరబడి పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఇటీవల నకిలీ పింఛన్లపై విచారణ జరిపి స్తామని సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేశారు.

చేసిందెవరు?

గత ప్రభుత్వంలో వలంటీర్లు చెప్పిందే వేదం.. వారు ఏం చెబితే అది.. క్షేత్రస్థాయి పరిశీలన అంతంతమాత్రమే. దీంతో ఇబ్బడిముబ్బడిగా పింఛనుదారులు పెరిగిపోయారు. చాలా గ్రామాల్లో పదుల సంఖ్యలో అనర్హులు ఉన్నట్టు సమాచారం. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది తీగలాగితే డొంక కదులుతోంది. ప్రతి గ్రామంలోనూ నకిలీ పింఛనుదారులు ఉన్నట్టు సమాచారం.వీరిలో వినికిడి సమస్య ఉన్నట్టు నమోదు చేయించుకుని పింఛనుపొందుతున్న వారు అధికం..అంతే కాకుండా పెరాలసిస్ వ్యాధికి గురై శాశ్వత దివ్యాంగత్వం పొందినట్టు పింఛనుపొందుతున్న వారు ఉన్నారు. మరికొంత మంది మానసిక వికలాంగులగాను పింఛను పొందుతున్నట్టు తెలిసింది. ఇంకొంత మంది వయసు తప్పుగా నమోదు చేయించుకుని వృద్ధాప్య పింఛను పొందుతున్నారు. ఇలా రకరకాలుగా ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఇదిగో నకిలీ..మకిలీ..

గోపాలపురం మండలం కరిచర్లగూడెంకు చెందిన ఒక వ్యక్తి గత వైసీపీ ప్రభుత్వంలో కొంత మందికి నకిలీ సర్టిఫికెట్లు అందజేసినట్టు సమాచారం. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేలు చొప్పున చాలా మంది నుంచి వసూలు చేసినట్టు తెలిసింది. ఆ సర్టిఫికెట్‌ను అడ్డుపెట్టుకుని అప్పటి వలంటీర్లు చేతివాటం ప్రదర్శించి ఆన్‌లైన్ చేయడంతో గత ఐదేళ్లుగా సామాజిక భద్రత పింఛన్ పేరుతో కరిచర్లగూడెం గ్రామంలో సుమారు ఆరుగురు రూ.15 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల పింఛన్లు పొందుతున్నారు. అంతే కాకుండా గోపాలపురం మండలం ఉప్పరగూ డెంలో డప్పు వాయించడం రాని కొందరు నకిలీలను సృష్టించి వారిని వలంటీర్ల సాయంతో డప్పు కళాకారులుగా చిత్రీకరించి వారికి ఆన్‌లైన్ చేయ డంతో సుమారు ఏడుగురు నెలకు ఒక్కొక్కరు రూ.4 వేలు చొప్పున అంటే నెలకు రూ.28 వేల ప్రభుత్వ ధనాన్ని లూటీ చేస్తున్నారు. ఈ నకిలీ పిం చన్లపై స్థానికులు ఎంపీడీవో, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసి రెండు నెలలవుతున్నా నేటికీ చర్యల్లేవ్.ప్రస్తుత సచివాలయ సిబ్బంది వారికి దర్జాగా పింఛను అందజేయడం కొసమెరుపు.

రేపే పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు నెల 1న పంపిణీ చేయవలసిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నారు.ఒకటవ తేదీ ఆదివా రం కావడంతో ఉద్యోగులకు కూడా ఇబ్బంది కలగకుండా 31వ తేదీ ఉదయం 5 గంటల నుంచే పంపిణీ ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 512 సచివాలయాలు 9041 క్లస్టర్ల పరిధిలోని 2,39,152 మంది లబ్ధిదా రులకు 5,169 మంది అధికారులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఉదయం 5 గంటలకు పంపిణీ ప్రారంభించి మధ్యాహ్నం 12గంటల లోపు పూర్తి చేయాల న్నారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకూ పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. ఎవరైనా తీసుకోని వారుంటే 2న సోమవారం పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలో డీఆర్‌డీఏ పీడీ ఆధ్వర్యం లో ఎంపీడీవోలు అంతా కంట్రోలు రూమ్ విధు ల్లో ఉండాలన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో ఈనెల 31న లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.



జెండా ఊపి 5కె రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

క్రీడలతో మానసికోల్లాసం

జాతీయ క్రీడా దినోత్సవంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 29 : క్రీడలతో విద్యార్థులకు శారీక దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం పెరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని వై. జంక్షన్ నుంచి గోదావరిగట్టు ఇస్కాన్ టెంపుల్ వరకూ 3కే రన్ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ఒక అలవాటుగా మార్చుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఆగస్టు 29న ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా ఆ రోజున జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న పలువురు క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్సు అధికారి శేషగిరిరావు, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్, గౌతంరాజు, జగన్నాథం, పీటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

జాతీయ స్థాయిలో టైక్వాండో 73 కిలోల విభాగంలో వెండి పతకం సాధించిన గుబ్బల మేరీగోల్డ్, జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ 73 కిలోల విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకున్న నల్ల ప్రజ్ఞ, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ టేబుల్ టెన్నిస్‌లో పాల్గొన్న గౌతమ్, జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్ 13 విభాగంలో పాల్గొన్న వెంకట చైతన్య, 46వ జాతీయ స్థాయి ఇండియన్ మాస్టర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లో పాల్గొన్న రుద్రకుమార్, జాతీయ జూనియర్ మహిళల 97 కిలోల కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన దివ్యశ్రీ, అంతర్జాతీయ మానస్ ఇండో బంగ్లా ఫ్రెండ్‌షిప్ కప్ 2023 వీల్‌చైర్ క్రికెట్ టీం టీ 20లో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్, 3వ జాతీయ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ విభాగంలో బంగారు పతకం సాధించిన కిరణ్మయి, 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో 2023-24 అండర్ 19 విభాగంలో బాక్సింగ్‌లో పాల్గొన్న అక్షిత, 2వ ఎన్‌వైఎస్ఎఫ్ జాతీయ యోగ పోటీల్లో పాల్గొని గిన్నిస్ రికార్డు సాధించిన సాత్వికలను సన్మానించారు.

వనం మనం విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 29 : హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఒక సామాజిక బాధ్యతగా చేపట్టి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధేశించిన లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం డివిజన్, మండల స్థాయి ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వనం మనంపై దిశానిర్దేశం చేశారు.ఈ మేరకు నవంబరు 1 వరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. తల్లిపేరుతో ఒక మొక్క నాటి వాటి విషయంలో పరిరక్షణ చేపట్టాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం ఎంపీడీవోలు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వఆఫీస్‌లు, పాఠశాలలు, కాలేజీలు, పరిశ్రమల ఆవరణాల, కెనాల్ బండ్లు, శ్మశాన వాటికల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపటాలన్నారు.

కొవ్వూరులో కట్..కట!

- రోజంతా తాగునీరందక ఇక్కట్లు
- గత నెల రోజులుగా సమస్య
- తరచుగా మోటార్లకు మరమ్మతులు
- అల్లాడిపోతున్న ప్రజానీకం
- గోదారి చెంతనే ఉన్నా ఇంతే..

కొవ్వూరు, ఆగస్టు 29 : అఖండ గోదావరి చెంతనే ఉన్నా గొంతెండిపోతోంది.. గత నెల రోజులుగా సమస్య ఉన్నా కనీసం కన్నెత్తి చూసిన అధికారులు లేరు.. దీంతో కొవ్వూరు పట్టణవాసులకు దాహం కేకలు తప్పడం లేదు. నాలుగు దశాబ్దాల కిందట వేసిన పైపులైను కావడంతో తరచూ మరమ్మతులతో ప్రజలకు తాగునీటి వెతలు తప్పడం లేదు. తాగునీరు అందించడం లేదని కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేసి 24 గంటలు గడవక ముందే బుధవారం అర్ధరాత్రి మునిసిపల్ మెయిన్ వాటర్‌వర్కుల్లో 40 హెచ్‌పీ మోటారులో మంటల ఎగసిపడి కాలిపోయింది. దీంతో పట్టణంలోని 23 వార్డులకు గురువారం తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది హుటాహుటిన మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, పబ్లిక్‌హెల్త్ డీఈ డి.సత్యనారాయణ పనులు పర్యవేక్షించారు. తరచూ మరమ్మతులకు గురవడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో 12,982 కుటుంబాలు..

కొవ్వూరు పట్టణంలో మునిసిపల్ లెక్కల ప్రకారం 12,982 కుటుంబాలు, 39,706 మంది జనాభా ఉన్నారు. పట్టణంలో సుమారు 50 కిలోమీటర్ల పైపులైను ద్వారా ప్రజలకు త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే 1984 సంవత్సరంలో వేసిన పైపులైను కావడంతో ఎక్కడో ఒకచోట తాగునీటి పైపులైను లీకేజీలకు గురవుతున్నాయి.అప్పట్లో పట్టణంలో 1000 కుళాయి కనెక్షన్లు ఉండేవి. ప్రస్తుతం 4950 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. విస్తరిస్తున్న పట్టణం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్తమోటార్లు, పైపులైను నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో తరచుగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తప్పడం లేదు. వాటర్ వర్క్సులో ఉన్న రెండు మోటార్లు మూడు రోజుల వ్యవధిలో మరమ్మతులకు గురై ప్రజలు దాహంతో అల్లాడారు. ఇటీ వల పట్టణంలో గత ప్రభుత్వం మంజూరుచేసిన 4 జగనన్న కాలనీలకు తాగునీరు పూర్తిగా అందడం లేదు. ప్రస్తుతం వాటర్‌ట్యాంకుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. దీనికితోడు ఇందిరమ్మకాలనీ, అచ్చాయమ్మకాలనీ, యానాదికాలనీ, రాజీవ్‌కాలనీ, బ్రిడ్జిపేటలలోని ప్రజలకు వాటర్‌ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మరో వక్క లీకేజీల మరమ్మతుల పేరుతో గుంతలు తవ్వి ఎక్కడికక్కడ రోజుల తరబడి వదిలివేయడంతో ఆ గుంతల్లో వర్షపునీరు చేరి తాగునీరు కలు షితం అవుతుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.గత ప్రభుత్వంలో తాగునీటి ఇబ్బందులను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకంలో గోదావరి జలాలు శుద్ధిచేసి పట్టణ ప్రజలకు అందించడానికి కొవ్వూరు మునిసిపాలిటీకి ఏఐఐబీ నిధులు రూ.58 కోట్లు మంజూరు చేసింది. ఈ పథకంలో 2 ప్యాకేజీలుగా పనులు ప్రారంభించినా పూర్తికాలేదు.



పైప్‌లైన్ పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

మోటార్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు : చైర్‌పర్సన్

కొవ్వూరు, ఆగస్టు 29 : ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరా చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు మునిసిపాలిటీ ప్రధాన వాటర్‌వర్క్సులో 40 హెచ్‌పీ మోటారు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం అర్ధరాత్రి కాలిపోయింది. దీంతో గురువారం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలనుంచి ఫిర్యాదులు రావడంతో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, పబ్లిక్ హెల్త్ డీఈ డి.సత్యనారాయణ, కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు వాటర్‌వర్క్సును సందర్శించారు. మోటారు కాలిపోవడానికి గల కారణాలను ఏఈలు కె.సుమంత్, పి.దుర్గాకిశోర్‌లను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన మోటారు స్థానంలో స్టాండ్ బై ఉన్న 30 హెచ్‌పీ మోటారును పంపునకు అమర్చి సాయంత్రానికి తాగునీటి సరఫరాను కొంతమేర పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయానికి పూర్తిస్థాయిలో వాటర్ సరఫరా చేస్తామని ఏఈలు దుర్గాకిషోర్, కె.సుమంత్‌లు తెలిపారు. రూ. 5 లక్షలతో కొత్త మోటారు, పంపుసెట్ కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మాతృ భాషపై మమకారం

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్



రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఒక న్యాయాధికారి మాతృ భాషపై మమకారం చాటుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీ కేసులో 2022లో ఇద్దరిపై కేసు నమోదైంది. రెండేళ్లగా కొనసాగుతున్న ఈ కేసు గురువారం మొదటి శ్రేణి రెండో అదనపు న్యాయాధికారి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ బెంచిపైకి వచ్చింది. ఆయన విచారించి నేరం రుజువు కాకపోవ డంతో నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ తెలుగులో తీర్పు వెలువరించారు. అంతేకాకుండా తీర్పు కాపీని కూడా తెలుగులోనే ఇచ్చారు. అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మన భాషను మించిన భాష లేదన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తెలుగు భాషను ప్రోత్సహించడానికి తన వంతు కృషిలో భాగంగా 2018 నుంచి తెలుగు భాషా దినోత్సవం రోజున ఏదో ఒక కేసులో తీర్పును తెలుగులో చెప్పడం అలవాటు చేసుకున్నానన్నారు. కక్షిదారులకు అర్థమయ్యేలా వారి మాతృ భాషలో తీర్పులను తర్జుమా చేసి ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానాలు సైతం చెప్తున్నాయని గుర్తు చేశారు. తెలుగు భాష చాలా గొప్పదని, మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేయాలన్నారు. కృష్ణప్రసాద్‌ను పలువురు అభినందించారు.

మంద కృష్ణమాదిగను కలిసిన మాజీ మంత్రి జవహర్



మందకృష్ణ మాదిగను శాలువాతో సత్కరిస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్

కొవ్వూరు, ఆగస్టు 29: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదిగల మహాజన నేత వర్గీకరణ సాధకుడు మంద కృష్ణమాదిగను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని నివాసంలో కృష్ణమాదిగను కలిసి శాలువా కప్పి సత్కరించారు. జవహర్ వెంట తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆశిష్‌లాల్, పసలపూడి బోసు ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 29: కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కోరినట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, ఐటీడీపీ ఇంచార్జి గెల్లా సురేష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన సీనియర్లకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని, అదేవిధంగా నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కారానికి, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పేదలకు వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేయాలని కోరామన్నారు.

ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఖండవల్లి



నిడదవోలు, ఆగస్టు 29 : నిడదవోలు మండలం శెట్టిపేటలోని జైహింద్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఖండవల్లి మాణిక్యాలరావు, కార్యదర్శిగా క్రొవ్విడి పెదనాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఖండవల్లి వీరవెంకట్రావు మరో తొమ్మిది మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను ఫిషర్‌మెన్ డవలప్‌మెంట్ అధికారి ఎస్‌బీ గణేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఐదు సంత్సరాలకు ఒక్కసారి జరిగే ఎన్నికలలో అధ్యక్షుడే ఖండవల్లి మాణిక్యాలరావు, కార్యదర్శి క్రొవ్విడి పెదనాగరాజు, ఉపాధ్యక్షుడు ఖండవల్లి వీర వెంకట్రావు మరో తొమ్మిది మంది కమిటీ సభ్యులను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖా భాస్కరరావు ప్రత్యేకంగా అభినందించారు.

వైసీపీ సర్పంచ్ జనసేనలో చేరిక



వైసీపీ సర్పంచ్ బండి చిట్టిని జనసేనలోకి ఆహ్వానిస్తున్న జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ

నల్లజర్ల, ఆగస్టు 29 : నల్లజర్ల మండలం తెలికిచర్ల వైసీపీ సర్పంచ్ బండి చిన్న నాగరాజు(చిట్టి)జనసేన పార్టీలో చేరారు. గురువారం జనసేన జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ చిట్టితోపాటు వైసీపీ నుంచి గ్రామపార్టీ అధ్యక్షుడు కుంచె విష్ణుమూర్తి, కుంచే తాతలు, కుంచే రాంబాబు, బాసంశెట్టి నాగేశ్వరరావు జనసేనలో చేరినట్లు జనసేన నాయకులు రుద్ర శ్రీను పేర్కొన్నారు.

మండల సమావేశంలో

మహిళా సర్పంచ్‌ల భర్తలదే హవా

చాగల్లు, ఆగస్టు 29 : మండలపరిషత్ సమావేశంలో సభ్యులు కానివారు పాల్గొని మాట్లాడటం పట్ల పలు విమర్శలు వస్తున్నా యి.. బుధవారం జరిగిన మండలపరిషత్ సర్వసభ్య సమా వేశంలో మహిళా ఎంపీటీసీలు బదులు వారి భర్తలు, మహిళ సర్పంచ్‌లు స్థానే వారి భర్తలు పాల్గొనడంను తప్పుపడుతున్నారు. గౌరిపల్లి మహిళా సర్పంచ్ హైమావతి బదులు ఆమె భర్త సత్యన్నారాయణ పాల్గొని మాట్లాడారు. మల్లవరం సర్పంచ్ బదులుగా ఉపసర్పంచ్ కోడూరి కాశి మాట్లాడారు. నెలటూరు ఎంపీటీసీ రమ్య బదులు ఆమె భర్త దామోదరరావు అతి చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇటువంటివి అదుపు చేయాలని, పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఓటు నమోదుపై అవగాహన

గోపాలపురం, ఆగస్టు 29: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసు కునే ఉపాధ్యాయులు వారు నివసించే సొంత మండలంలో ఓటు నమోదు దరఖాస్తును అందజేయాలని ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయ ఓటు నమోదు ప్రక్రియపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.శ్రీదేవి మాట్లాడు తూ సెప్టెంబర్ 3వ తేదీతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు పూర్తవుతుందన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులు సొంతమండలాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తాహశీల్దార్ కే.ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబ్జి మరణం టీడీపీకి తీరనిలోటు : ఎమ్మెల్యే ముప్పిడి



బాబ్జి సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, ఆగస్టు 29 : తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు ఇల్లూరి బాబ్జి సంతాప సభలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబ్జీ మరణం పార్టీకి తీరని లోటు అని తెలిపారు. అనంతరం బాబ్జీ కుటుంబ సభ్యులను కలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని సీనియర్ టీడీపీ నాయకులు అన్నమరెడ్డి సత్తిబాబు, అల్లూరి రాంబాబు, అన్నమరెడ్డి సోమరాజు, ఎల్లిన కాశీ, ఏసులంక తాతారావు, నాయుడు హనుమంత రావు, నున్న సోమశేఖరం తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు

ఉండ్రాజవరం ఎస్ఐ శీనివాస్ బాధ్యతల స్వీకరణ

ఉండ్రాజవరం, ఆగస్టు 29 : ఉండ్రాజవరం ఎస్ఐగా జి. శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వి. అప్పలరాజు రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

కొవ్వూరు, ఆగస్టు 29 : సెప్టెంబరు నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆగస్టు 31వ తేదీన శనివారం పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కొవ్వూరు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. సెప్టెంబరు 1న ఆదివారం కావడంతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆగస్టు 31న శనివారం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి మండలంలోని 16 గ్రామాలలో పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం పింఛన్లు పొందలేని వారు సెప్టెంబరు 2న సోమవారం పొందవచ్చునన్నారు.

అమ్మభాష పరిరక్షణ అందరి బాధ్యత

- నన్నయ ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు
- ఘనంగా తెలుగు భాషాదినోత్సవం



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నన్నయ ఇన్‌ఛార్జి వీసీ

దివాన్‌చెరువు, ఆగస్టు 29 : అమ్మభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం కార్యక్రమాలను గురువారం నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్యం నుంచి భాషపై పట్టుసాధించాలన్నారు. తెలుగుభాషా పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. నేటి ఆధునిక కాలంలో సోషల్ మీడియా సాధనాలు, కొత్తపోకడలు భాషలోని ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడలలో రాణించాలని కోరారు. ఖేలో ఇండియా నిధులతో నన్నయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ పనులు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తెలుగుశాఖ అధ్యాపకుడు తరపట్ల సత్యనారాయణ, వ్యాయామవిద్యా కోర్స్ కోఆర్డినేటర్ బాల సత్యనారాయణ, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఏబీఎన్ కళాశాలలో మాతృభాషా దినోత్సవం

కొవ్వూరు: మాతృభాష మన కంటి వంటిది, పరభాష కళ్ళజోడు వంటిది, మనం కంటిని కాపాడుకున్నట్లే మాతృభాషను కాపాడువాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏబీఎన్&పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు అన్నారు. కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగరావు డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు అ ధ్యాపకురాలు ఆర్.గౌతమి ఆధ్వర్యంలో విద్యార్థినులు రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రిన్సిపాల్ సుబ్బారావు విద్యార్థులకు మాతృభాషను గూర్చి వివరించారు. విద్యార్థులు తెలుగు, జానపద కథలు, తెలుగు పద్యాలు చదివిన తీరు ఆహుతులను అలరించాయి.

తాళ్లపూడి: తాళ్ళపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిస ఓద్య అనే విద్యార్థినికి తెలుగుతల్లి వేషధారణ వేసి సా ంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటకనకదుర్గ మాట్లాడుతూ తీయనైన భాష తెలుగు భాష అని ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని, దేశ భాషలందు తెలుగులెస్స అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తాళ్ళపూడి తహసీల్దార్ కార్యాలయంలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



చాగల్లులో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్ మెరికమ్మ



పెరవలి: అజ్జరం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవంలోపాల్గొన్న విద్యార్థులు

కార్యక్రమంలో తహ సీల్దార్ రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొని తెలుగు అక్షరాల ప్రకార్డులను ప్రదర్శించారు. విజేత ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ప్రధానోపాధ్యాయులు ప్రమోద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాష గొప్పతనాన్ని కీర్తిస్తూ పాటలు, పద్యాలతో నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలో తెలుగుభాషా దినోత్సవంను నిర్వహించి మాతృభాష విశిష్టతను తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి తహశీల్దార్ ఎం.మెరికమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏఎస్‌వో చిన్ని, సీనియర్ అసిస్టెంట్ కమల్, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు. చంద్రవరం ప్రాథమికోన్నత పాఠశాలలోను



నల్లజర్ల: గిడుగు సేవ పురస్కారం అందుకుంటున్న వసంతాడ ఆనంద్‌స్వరూప్

తెలుగుభాషా దినోత్సవంను, క్రీడా దినోత్సవంను సంయుక్తంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఆర్.రమాంబ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధాకృష్ణ, హేమా రావు చల్లారావు పాల్గొన్నారు.

ఆనంద్ స్వరూప్‌కి గిడుగు సేవా పురస్కారం

నల్లజర్ల: నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన సామాజికవేత్త వసంతాడ ఆనంద్ స్వరూప్ గిడుగు జాతీయసేవా పురస్కార్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నవ్యాంధ్ర రచయితల సంఘం కార్యదర్శి బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు విజయవాడలోని ఠాగూర్‌స్మారక గ్రంథాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని సాహిత్య, కళా, సేవా రంగాల్లోని ప్రముఖులకు పురస్కారాలు అందించి సత్కరించినట్లు పేర్కొన్నారు. గిడుగు జాతీయ సేవ పురస్కారాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ చేతుల మీదుగా తీసుకున్నట్లు చెప్పారు.

పెరవలి: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలల్లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అజ్జరంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కాశీ విశ్వనాథం మాట్లాడుతూ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ గౌరవ సూచికంగా ఆయన పుట్టిన రోజు ఆగస్టు 29న జరుపుకుంటారని తెలిపారు.

దేవరపల్లి: దేవరపల్లిలో శ్రీచైతన్య భాష్యం స్కూల్స్‌లో గురు వారం తెలుగు భాషాదినోత్సవం, క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగు భాషకు ఎంతో కృషి చేశారన్నారు. వివిధ వేషధారణలో విద్యార్థులు అలరించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు బహుమతులు అందజేశారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు కోట రామప్రసాద్, రీడర్స్ ఫోరమ్ సభ్యులు ఆకెళ్ల శ్రీనివాస్, లైబ్రేరియన్ జి. కృష్ణారావు, పాఠకులు పాల్గొన్నారు.



దేవరపల్లి శ్రీచైతన్య స్కూల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిషోర్



కొవ్వూరు ఏబీఎన్ కళాశాలలో మాతృభాష దినోత్సవం



తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయంలో తెలుగు అక్షరాల ప్లకార్డుల ప్రదర్శిస్తున్న తహశీల్దార్

సంజయ్ కలాసీ సేఫ్!

- నేడు పోలీసుల ముందుకు కిడ్నాపర్లు!
- మధ్యవర్తి ద్వారా పోలీసులతో మంతనాలు
- స్వచ్ఛందంగా లొంగుబాటుకు అంగీకారం







అపహరణకు గురైన సంజయ్ కలాసీ (ఎడమ), నిందితులు మున్నా, స్వామినాయుడు (కుడి)

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన చేపల వ్యాపారి సంజయ్ కలాసీని అపహరించిన ఘటనలో నిందితులు మధ్యవర్తి ద్వారా పోలీసులతో మాట్లాడారని తెలుస్తోంది. సంజయ్ కలాసీ అమలాపురం, తుని పరిసర ప్రాంతాల్లో చేపల రైతుల వద్ద నుంచి సరుకు కొనుగోలు చేసి ఒడిశా తీసుకెళ్తాడు. ఓ ఐదారు నెలలు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించాడు. దీంతో స్వామినాయుడు అనే మధ్యవర్తి కమీషన్ కోసం పలువురు రైతుల వద్ద నుంచి సంజయ్‌కు సరుకు ఇప్పించాడు. ఈ క్రమంలో సుమారు రూ.3 కోట్లు బకాయిపడ్డాడు. వివిధ పోలీస్ స్టేషన్లలో అతడిపై ఏడు కేసులు ఉన్నాయి. కలాసీపై పోలీసులకు ఫిర్యాదు చేయడం.. వారు అరెస్టు చేయడం.. జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ఒడిశా వెళ్లిపోవడం జరుగుతోంది. ఇలా మూడేళ్ల నుంచీ వేధిస్తున్నాడు. అందరూ తెలిసినవాళ్లు కావడంతో రోజూ తమ బాకీల కోసం అడుగుతుండడంతో స్వామినాయుడు వారి కంటపడకుండా ఊరు విడిచి తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో విసుగు చెందిన స్వామినాయుడు జైలు నుంచి విడుదలయ్యే సమాచారం తెలుసుకుని అపహరించాడు. దీనిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేసి ఆరు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. అమలాపురం, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు ప్రాథమికంగా తెలుసుకున్నారు. ఈలోపు గురువారం ఒక మధ్యవర్తి పోలీసులతో మాట్లాడి నిందితులు వచ్చి లొంగిపోతారని, బకాయిలు వసూలు కోసమే వారు అలా చేశారని చెప్పారు. పోలీసులు సానుకూలంగా స్పందించడంతో శుక్రవారం ఉదయం పోలీసుల ముందుకు నిందితులు వచ్చే అవకాశం ఉంది. బాధితుల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గ్రామానికి చెందిన వాళ్లే ఎక్కువ మంది ఉన్నారని చెప్తున్నారు. దీంతో ఆయన స్వయంగా రంగంలోకి దిగి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన విధానం కాదని మందలించడం, నిందితులు నేరస్వభావం కలిగిన వారు కాకపోవడం వల్ల పోలీసుల ముందుకు రావడానికి ఒప్పుకున్నారని తెలుస్తోంది. అపహరణకు గురైన సంజయ్ కలాసీకి ఎలాంటి హానీ తలపెట్టలేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. సంజయ్.. అతడిని అపహరించిన నిందితులంటూ స్వామినాయుడు, మున్నా ఫొటోలను ఎస్పీ కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. ఆచూకీ తెలిసిన వారు 9440796574, 9490760792 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు కోరారు.

గోవును జాతీయ జంతువుగా

ప్రకటించాలి

నల్లజర్ల, ఆగస్టు 29 : నల్లజర్లలో విశ్వహిందూ పరిషత్ షష్ట్యబ్ధి ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. స్థానిక సోమాలమ్మ తల్లి ఆలయంవద్ద జిల్లా కారదర్శి ముత్యాల గంగాధర్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉత్తరాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షుడు వేణుగోపాలరాజు, పేరవరం గీతాశ్రమం పీఠాధిపతి సత్యానందగిరి స్వామీజీ విచ్చేసి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపల్లి స్వర్ణదుర్గాశ్రమం నిర్వాహకులు రాజగోపాల్, మైనం పద్మజ, దుర్గావాహిని, శెట్టిపల్లి గణేశ్వరి, మండలాధ్యక్షులు కందుల రవి, ఆలపాటి ధనలక్ష్మి, వెల్లంకి రాఘవ, మాయలేడి తాతారావు, నవలం రామకృష్ణ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న పీఠాధిపతి సత్యానందగిరి స్వామీజీ

సీజనల్ వ్యాధులపై వైద్య శిబిరం



నిడదవోలు నెహ్రూనగర్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ తేజశ్రీ

కొవ్వూరు, ఆగస్టు 29 : సీజనల్ వ్యాప్తి అధికంగా ఉన్నందున ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు అన్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులదృష్ట్యా దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలోని పెనకనమెట్ట గ్రామంలో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. జ్వర పీడితులను గుర్తించి రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఇచ్చారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాలు, వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షపునీరు నిల్వ ఉండకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య, సీహెచ్‌వో బీవీ లక్ష్మి, ఎంపీహెచ్ ఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమరాజు పేర్కొన్నారు. కానూరు ఆరోగ్యకేంద్ర పరిధిలోని నడిపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి గ్రామంలో జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. అదేవిధంగా పెరవలి ఆరోగ్యకేంద్ర పరిధిలో ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఆరోగ్యం పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

నిడదవోలు: ప్రజలంతా ఏ చిన్న ఆరోగ్య సమస్య లు తలెత్తినా తక్షణం వైద్యులను సంప్రదించాలని నెహ్రూనగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్రీ అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలోని నెహ్రూనగర్‌లో సీజనల్ వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తేజశ్రీ మాట్లాడుతూ ఈనెల 29, 30, 31 తేదీలలో ఇంటింటా సీజనల్ వ్యాధులపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. జ్వరాలు ఉన్న ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు పెట్టి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో తీరుగూడెంలో డాక్టర్ ప్రసన్నకుమార్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరిక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని మలకపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అన్నపూర్ణ తెలిపారు. తాళ్ళపూడి మంబడలం పెద్దేవంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ వర్షాకాలంలో క్రిమి కీటకాలు, దోమలు విపరీతంగా పెరగటం వలన, తాగు నీరు కలుషితం కావడంతో వివిధ రకాల అంటు వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసార, జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అందరూ కాచి చల్లార్చిన మంచినీటిని తీసుకోవాలని ఇంటిచుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ప్రతి గ్రామంలో వారానికి ఒక రోజు వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి మండలం యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో యాదవోలు ఎస్సీ కమ్యూనిటీ హాలువద్ద గురువారం వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ వైద్య శిబిరంలో 84మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ హరిచందన తెలిపారు. వారిలో 12మంది జ్వరాల భారీనపడ్డారని వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతీ ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ పద్మకుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరా ల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు నవ్యశ్రీ అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ ప్రసన్నకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ హర్షిణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలగదుర్రులో ఇంటింటా ఫీవర్ సర్వే

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషాదేవి, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రీడల్లో రాణించాలి'

ఉండ్రాజవరం, ఆగస్టు 29: ఉండ్రాజవరం హైస్కూలులో గురువారం జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావ, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎమ్ఎన్‌పీ వల్లీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని చెప్పారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలని వారు కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

పవన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

పెరవలి, ఆగస్టు 29: వచ్చేనెల 2వ తేదీన జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో వైభవంగా నిర్వహించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పిప్పర రవి పేర్కొన్నారు. పెరవలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తులా చినబాబు, నాగరాజు, నందిప చక్రవర్తి, మురళి, దాసం మాణిక్యం, గన్నేపల్లి హనుమంతు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధులకు కొత్తజీవితం

చాగల్లు, ఆగస్టు 29 : నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానం పవిత్రమైన బాధ్యత అని కుటుంబ వారసత్వంగా కొనసాగించాలని డాక్టర్ తనూజ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీ.మనోజ్, ఓఓ గురుస్వామి, సిబ్బంది జమీల, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెరవలి, ఆగస్టు 29 : వినాయక చవితి సందర్భంగా ఆయా గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలు మండపాలు ఏర్పాటు చేసే కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ అప్పారావు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వినాయక చవితి కమిటీ సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు.